# చతురస్రం

**సీరియల్ కథ**

["చతురస్రం" అనే పేరున ఒక సీరియల్ కథను ఆలిండియా రేడియో (హైదరాబాదు) నుండి నలుగురు రచయితలు ప్రసారం చేశారు. నాలుగధ్యాయములు వరసగా వ్రాసినవారు శ్రీయుతులు అజంతా, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసు, నెల్లూరి కేశవస్వామి. అజంతా వ్రాసిన మొదటి అధ్యాయాన్ని యిక్కడ ప్రచురిస్తున్నాము. తక్కినవి వరుసగా వెలువడుతాయి.]

కథానాయకుడు వెంకట్రావు హఠాత్తుగా నిద్ర మేల్కొన్నాడు ఒక్క అక్షరంకూడా పొల్లు పోకుండా కథానాయకుడు వెంకట్రావు మహాభారతంలా తెరుచుకున్నాడు ఒళ్ళు విరుచుకుంటూ బద్ధకంగా కాస్సేపు పక్కమీదనే పడుకోవటంగాని నేత్రద్వయాన్ని అతి జాగ్రత్తగా తెరిచి మొట్టమొదట చూపు గురి తప్పకుండా గోడమీద భగవంతుడి ఫోటో మీదకే పడేటట్టు శ్రద్ధ తీసుకోవడంగాని, అరచేతిలో శ్రీరామ రాసుకోవటంగాని ఇత్యాది కార్యక్రమాలు ఏమీ ఉండవు. వెంకట్రావు ఎప్పుడు నిద్రమేల్కొన్నా అంతే సరాసరి నిద్రమేల్కొంటాడు. పొద్దున్నే ఎవరో వచ్చి హఠాత్తుగా కొరడా పుచ్చుకొని కొట్టినట్టు ఉలిక్కిపడి నిద్ర మేల్కొంటాడు. అలా మేల్కోవటం ఏమిటి, మేల్కొన్నవాడు మేల్కొన్నట్టుగానే పక్కమీద నుంచి నేరుగా ప్రపంచంలోకి పరిగెత్తుకుంటూ వెళ్ళిపోతాడు. గత ఐదేళ్ళనుంచీ కథానాయకుడు వెంకట్రావు నిద్రమేల్కొనటం అనే సన్నివేశం నిరాఘాటంగా ఇదే ఫక్కీలో సాగిపోతూ ఉంది. తెల్లవారుతుంది. కోడి కూస్తుంది. పిల్లగాలి మెల్లగా వీస్తుంది గుమ్మం ఎదురుగా ఉన్న మందారపు మొక్క ఎర్రగా నవ్వుతుంది. కాని వెంకట్రావుకు ఇటువంటి వాటితో నిమిత్తం ఏమీలేదు ఉదయకాలపు శోభ మనస్సుకెంతో హాయినిస్తుందన్న విషయం పుస్తకాలలో ఎప్పుడైనా చదివేడేమోగాని, అనుభవరీత్యా మాత్రం వెంకట్రావు ఇంత వరకూ తెలుసుకోలేదు. ఉలిక్కిపడి వెంకట్రావు నిద్రలేస్తాడు మీట నొక్కినట్టు గభీమని లేచి నుంచుంటాడు గది నాలుగ్గోడలూ ఒక్కసారి కలయచూస్తాడు. గదిలో చెప్పుకోతగ్గ వస్తువులేమీ ఉండవు. గది మూలగా ఒక మూట చిత్తు కాగితాల కట్ట మాత్రం ఉంటుంది చిత్తు కాగితాలంటే వెంకట్రావుకు అపారమైన ప్రేమ ప్రాణాపాయంలోంచి వెంకట్రావును అవి అనేకసార్లు రక్షించాయి. వెంకట్రావు దినపత్రికలు చదవటానికి కొనడు. తిరిగి మళ్ళీ వాటిని అమ్మడానికి కొంటాడు.

దినపత్రికలు చదివితే ఉన్న మతి కూడా పోతుందని వెంకట్రావు స్వానుభవంమీద ఇటీవల ఏర్పరుచుకున్న సిద్ధాంతం గదిలో మరొక మూల దీనాతి దీనమైన దృశ్యం మరొకటి కన్పిస్తుంది. మాసి మరకలు పడి గోడలకు అటూ ఇటూ ఒక పాంటూ, షర్టూ వేలాడుతూ ఉంటాయి. అంతకుమించి గదిలో వెంకట్రావు

ప్రాణసమానంగా చూసుకునే వస్తువులు మరేమీ ఉండవు. ఒక చాపచుట్ట మాత్రం నిర్లక్ష్యంగా మూలకు నెట్టబడి ఉంటుంది. వెంకట్రావు నిద్ర లేచీ లేవటంతోటే అతని దృష్టి మొదట పాంటూ, షర్టూ వేలాడుతున్న దిక్కుకు వెళ్లుతుంది. అవి యథాస్థానంలో వున్నాయో లేదో తేల్చుకొన్న అనంతరం వెంకట్రావు వాటిని అతి జాగ్రత్తగా అడుగులో అడుగువేసుకుంటూ సమీపిస్తాడు. సమీపించి వాటిని రెండుచేతుల తోటీ ఒక్కసారి తాకి ఆఘ్రాణించి ముద్దుపెట్టుకుంటాడు ఆ తర్వాత వాటిని గబగబా తొడిగేసుకుంటాడు అంతవరకూ లుంగీగా ఉపయోగించిన దుప్పటిని ఊడిపుచ్చుకొని మూలకు విసిరిపారేస్తాడు ఆ తర్వాత ఏమౌతుందంటే కథానాయకుడు వెంకట్రావు గదిమధ్యగా వచ్చి ఒక్కసారి నుంచుంటాడు

మధ్యగా నుంచోటం అంటే అక్షరాలా మధ్యగా నుంచోటం గణితశాస్త్ర రీత్యా గది యొక్క మధ్య బిందువును నిర్ధారణ చేసుకుని సరిగ్గా అక్కడే ఆ బిందువుమీదనే బొటనవేళ్లమీద నుంచోవటం. అలా నుంచోవటంవల్ల అతడు పొందే ప్రత్యేకమైన ఆనందం ఏమిటో ఇంతవరకూ భగవంతుడికూడా తెలియదు కాని రోజూ ప్రొద్దున్నే నిద్రలేచీ లేవటంతోటి ఈ కార్యక్రమం మట్టుకు జరగక తప్పదు అలా బొటన వేళ్ళమీద గది మధ్యస్థంగా నుంచుని, కథానాయకుడు వెంకట్రావు మెల్లిగా ఒక్కసారి ముందుకు వంగి గూట్లో ఉన్న కళ్లజోడును చేతపట్టుకొని దాన్ని వెనక్కి తిప్పి అరచేత్తో ఒక అద్దాన్ని వెనకవైపు మూసి అందులో తన ముఖాన్ని ఖంగారుగా ఒకసారి చూసుకుంటాడు. అంత ఖంగారుతనంలోను కూడా వెంకట్రావు ఆ రోజు ప్రొద్దున్న తన ముఖం పోలిక ఏ విధంగా ఉందో అందుకు సంబంధించిన వర్ణనను నిమిషాలమీద ఆలోచించి ఏర్చి కూర్చుకుంటాడు. వెనువెంటనే దానికొక నామకరణం చేయటం కూడా జరిగిపోతుంది. "వెధవది ముడతలుపడి, మడత కుర్చీలా అసహ్యంగా ఉంది," అనుకొంటాడు.

అసలు వెంకట్రావు ముఖం రోజూ కొక విధంగా కనిపిస్తూవుంటుంది. ఒకరోజు గులక మంచంలాగ గజిబిజిగా ఉంటుంది. మరొక రోజు ముడతలు పడి మడతకుర్చీలా ఉంటుంది. మరో రోజు చుంచెలకలా ఉంటుంది. ఆ తర్వాత రోజు చెవులపిల్లిలా వుంటుంది. అదృష్ట వశాత్తు ఎప్పుడైనా నూటికి కోటికి ఒకసారి మాత్రం మందారప్పువ్వులా కనబడుతుంది. అలా మందారప్పువ్వులా కనపడ్డ రోజున వెంకట్రావు జీవితంలో ఆశ్చర్యకరమైన హఠాత్సంఘటనలు అనేకం జరుగుతాయి రోడ్డుమీద అడుగు పెట్టీ పెట్టటంతోటే అందమైన ఆడపిల్ల ఎదురౌతుంది ఎదురైన ఆ అందాలరాణి అలా ఎదురైనట్టుగా వెళిపోదు. ఒళ్ళంతా కళ్లుచేసుకుని నఖశిఖ పర్యంతం వెంకట్రావును చూస్తూంది. 'అందమైన ఆడపిల్లలచేత ప్రేమించబడటానికి అవసరమైన యోగ్యతాపత్రం నా దగ్గిర కూడా వున్నది పరవాలేదులే' అని హామీ ఇస్తున్నట్టుగా చూస్తుంది అదృష్టదేవత ఇంకా కనికరిస్తే సదరు ఆడపిల్ల ఒక చిరునవ్వుకూడా విసురుతుంది ఆ ఒక్క చిరునవ్వుతోటీ వెంకట్రావు జన్మ తరించిపోతుంది ఒక క్షణంపాటు వెంకట్రావు ఎక్కడో నుస్వప్నలోకంలోనో విహారం చేసి చక్కావస్తాడు తర్వాత వెంకట్రావుకు ఆ రోజు ఊళ్ళో వున్న మిత్రబృందం యావత్తు ప్రత్యక్షమౌతుంది. నిజంగా విచిత్రం అది. అందుకు కారణం కూడా ఎవరు చెప్పలేరు. ఎదురైన మిత్రులంతా అతన్ని ఆప్యాయంగా పల్కరిస్తారు యోగక్షేమాలడిగి తెలుసుకొంటారు. జీవితాన్ని చక్కబరుచుకునేందుకు అవసరమైన సలహాలను అడక్కుండానే ఉచితంగా ఇచ్చి వెళ్లిపోతారు వెంకట్రావు విని మనస్సులో నవ్వుకుంటాడు జీవితం ఒక వైపు పెద్దపులిలా వెంటాడుతున్నప్పటికీ ఆ రోజుకు మట్టుకు అతను దాన్ని చూసి అంతగా భయపడడు.

మోసగించే ప్రపంచాన్ని మోసగించాలి. కాని కథానాయకుడు వెంకట్రావుకు ఇంకా అంత గుండె ధైర్యం అలవడే అదృష్టం పట్టలేదు కాని ఆక్షేపించే ప్రపంచాన్ని అలాచేయకుండా నోరు మూయించే కిటుకుమాత్రం వెంక

ట్రావుకు తెలుసు. నిజం చెప్పాలంటే ఈ కిటుకు వెంకట్రావుకు చిన్నప్పుడే పట్టుబడింది ఇతరుల ఆక్షేపణకు గురికాకుండా తన శరీరం తాలూకు అందవికారాన్ని, నలుపురంగుతనాన్ని ఎలా కాపాడుకోవాలో అన్న విషయానికి సంబంధించిన సమస్యను పరిష్కరించుకోవటంలో వెంకట్రావు చిన్నప్పుడే కృతార్థుడైపోయాడు. ఒకసారి ఎప్పుడో చిన్నప్పుడు ఐదేళ్లవయస్సులో వెంకట్రావును వాళ్ళ అమ్మ ఇలా అంది, "వెధవ ఎలా ఉన్నాడో మాల వెధవలాగ" అంతే. వెంకట్రావు జీవితంలో ఆచ్ఛాదన కార్యక్రమం అన్నది ఆ క్షణం నుంచే ప్రారంభమయింది

నీళ్ళూ గట్రా పోసుకోకుండా రోడ్డుమీద అల్లరిచిల్లరిగా తిరిగి దుమ్ముకొట్టుకుంటూ ఇంటికి తిరిగివస్తే వాడి వాలకాన్ని చూసి భరించలేక ఆవిడ అలా అని ఉంటుంది. కాని పుట్టుకతోనే పుట్టెడు అభిమానంతో పుట్టిన వెంకట్రావు అంతరార్థం గ్రహించదల్చుకోలేకపోయాడు వెంకట్రావు నల్లగా ఉండేమాట నిజమే. ఐతేనేం అందరికి మాత్రం కాదు ఆ విషయం అతనికి తెలుసు కాని ఆ రోజున ఆవిడ అలా అన్నప్పటినుంచీ అతనిలో ఒక విపరీతమైన భయం ప్రవేశించింది తన్ను చూసి ఇతరులు ఏమనుకుంటున్నారో అన్న ఆందోళన ఇప్పటికీ ఎప్పటికీ అతన్ని క్రుంగదీస్తూనే వుంటుంది

తన శరీరం తాల్లూకు నల్లదనాన్ని వెంకట్రావు ఇంత వరకూ ప్రపంచానికి చూపించలేదు. నిలువెల్లా ముసుగులేకుండా ఇంత వరకూ ఎవరి కళ్లలోనూ అతడు పడలేదు. వీలుంటే ముఖంకూడా పూర్తిగా కప్పేసుకునేవాడే. వీలుపడక శరీరం తాలూకు మిగతా భాగాన్ని మాత్రం అతి శ్రద్ధగా, తెల్లని పరిశుభ్రమైన ముసుగుతో కప్పుకుంటూ వస్తున్నాడు.

కాని ఇటీవలి కాలంలో వెంకట్రావుకు అదనంగా మరొక ఇబ్బంది ఏర్పడింది. ప్రపంచంలో తనంతటతాను తన స్వంత కాళ్లమీద నిలబడి బ్రతకవలసిన అవసరం ఏర్పడిన ఈ దశలో అతన్ని మరొక ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొంది వెనుకటి రోజుల్లో ఐతే వెంకట్రావు తన శరీరాన్ని మాత్రమే ఆచ్ఛాదన చేసుకునేవాడు. ఇప్పుడు తన జీవితాన్నికూడా నలుగురి కళ్ళలో పడకుండా ఆచ్ఛాదన చేసుకోవలసిన అవసరం ఏర్పడింది లోపల్లోపల అట్టడుగున జీవితంనిండా అనేకమైన కుళ్లు కాలువలు—ప్రవహిస్తూ ఉన్నప్పటికి అవి ఇతరుల కళ్లలో మాత్రం ఏనాటికీ కనపడకూడదు. రోడ్డుమీదకు వస్తే వెంకట్రావు నిర్భాగ్యుడిలా కనపడకూడదు. నిరుద్యోగిలా కనపడకూడదు. తన ప్రస్తుత జీవితం తాలూకుచూసి ఆక్షేపించుకునే హక్కు తనకేతప్ప ఇతరు లెవ్వరికీ లేదు.

అంచేతనే వెంకట్రావుకు ప్రొద్దున్నే ఇంత హడావిడి. రంగస్థలంమీద నటుడు ప్రవేశించబోతున్నట్టు లేచీ లేవటంతోటే ఈ ఆచ్ఛాదన.

ఆచ్ఛాదన కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగిన అనంతరం ముఖప్రక్షాళన కార్యక్రమం ప్రారంభమౌతుంది ముఖంమీద మినహా నిలువెల్లా ముసుగు వేసుకున్న వెంకట్రావు ఆవుదూడమాదిరి ఒక్క గంతువేసి గదిగుమ్మం దాటి ప్రక్కనేవున్న కుళాయిదగ్గరికి వెళతాడు. పళ్ళపొడి, పళ్లుదోంపుల్లా ఇత్యాది ఉదయ జీవితావసర వస్తువుల నిమిత్తం లేకుండా చక్కగా భగవంతుడిచ్చిన వేళ్ళతో ముఖ్యంగా ఉంగరం పెట్టుకునే వేలుతో ముద్దొచ్చేటట్టు సున్నితంగా పళ్లు తోముకుని ముఖంకూడా అక్కడే తుడుచుకుని క్రాపు దువ్వుకుని అలాగే అదేదారిని పరిగెత్తుకుంటూ ప్రపంచం మీదకు వెళిపోతాడు

వీపుమీద ఎవరో కొరడాపుచ్చుకుని కొట్టినట్టు హఠాత్తుగా ఉలిక్కిపడి నిద్రమేల్కొనే వెంకట్రావు ఈ రోజుకూడా యథాప్రకారం అదేమాదిరి నిద్రమేల్కొన్నాడు గభీమని లేచి నుంచుని గదిచుట్టూ ఒక్కసారి కలియ చూశాడు ఆచ్ఛాదన సామగ్రి యథాస్థానంలోనే వేలాడుతూ ఉంది. అమాంతం అటువైపు తమాషాగా ఒక కుప్పిగంతువేసి గబగబా వాటిని తొడిగేసుకున్నాడు ఆ తర్వాత రివాజు ప్రకారం ఒక క్షణంపాటు గదిమధ్యగా నిలబడి ముందుకువంగి కళ్ళద్దాలలో ముఖం చూసుకో

వటానికి ఉద్యమించాడు. గత వారంరోజుల నుంచీ చుంచెలకలాగ కనపడుతున్న వెంకట్రావు ముఖం ఇవాళ మందారపువ్వులా కనబడింది ఆనందం పట్టలేక వెంకట్రావు ఒక్కసారి కెవ్వున అరిచాడు. ఈ రోజున మహత్తరమైన సంఘటన ఏదో ఒకటి జరిగిపోతుంది. తన జీవిత జపమాలికలో గుచ్చబడిన అనేకానేకమైన చిత్రవిచిత్రమైన హఠాత్సంఘటనలకు ఈ రోజున అదనంగా మరొకటి జేర్చబడుతుంది నిలువెల్లా ఉత్సాహం ఉప్పొంగగా వెంకట్రావు గిరగిరా మొగ్గలేసుకుంటూ ముఖప్రక్షాళనార్థం కుళాయి దగ్గరికి పోయాడు. కన్నుమూసి తెరిచేటంతలో సదరుకార్యక్రమం పూర్తయిపోయింది మరుక్షణం కథానాయకుడు వెంకట్రావు తూనీగలాగ ఎగురుకుంటూ ప్రపంచం మీదకు వెళిపోతున్న సన్నివేశం ప్రారంభమయింది. గుమ్మందాటి వెంకట్రావు అనంత విశ్వంలో అడుగు పెట్టేడు. ఇప్పుడు వెంకట్రావు వేసే ప్రతి అడుగు అతి జాగర్తగా ఉంటుంది. కత్తి మీద నడుస్తున్నట్టుగా ఉంటుంది. చుట్టూ వెయ్యి కళ్ళతో చూసుకుంటూ కథానాయకుడు వెంకట్రావు భయంకరమైన పద్మ వ్యూహంలో ప్రవేశిస్తాడు.

రోడ్లమీద నడిచేటప్పుడు వెంకట్రావు తప్పని సరిగా అనుసరించే ప్రత్యేకమైన నిబంధనలు కొన్ని ఉన్నాయి. వాటిలో మొట్టమొదటిది నిర్ణీతస్థలం అనేది ఏదీ లేకుండా కాళ్లు ఎటుపోతే అటు వెళ్ళటం రెండవది మెయిన్ రోడ్డుమీద నడవకుండా ఉండటం.

పోస్టుబాక్సులను చూసినా, పోస్టు బంట్రోతులను చూసినా వెంకట్రావుకు విపరీతమైన భయం. ఈ భయాన్ని తప్పించుకునే నిమిత్తమే వెంకట్రావు మెయిన్ రోడ్లమీద నడవకుండా ఎప్పుడూ చిన్నచిన్న సందుల్లో నడుస్తూ ఉంటాడు వెంకట్రావు అలా సందుల్లో నడవటానికి, పోస్టుబాక్సులను చూసి భయపడటానికి ఒక ప్రత్యేక కారణంఉంది పోస్టుబాక్సులను చూస్తే వెంకట్రావుకు హఠాత్తుగా తన ఇంటి విషయం గుర్తుకు వస్తుంది. ప్రస్తుతం తనకి తన తల్లిదండ్రులకి ఉన్న సంబంధం పోస్టు బాక్సు సంబంధం మాత్రమే. ఇక్కడా అక్కడా అతి కష్టంమీద తన ఆచూకి ఆరా తీసి అప్పుడప్పుడు వాళ్ల నాన్న ఉత్తరం రాలుస్తూ ఉంటాడు ఆ ఉత్తరాలు చూస్తే చాలు వెంకట్రావు నిలువెల్లా గజగజా వణికిపోతాడు తానొక మహా నేరస్థుడులాగ క్రుంగిపోతాడు. కథానాయకుడు వెంకట్రావు ఇల్లు విడిచి పెట్టి ఐదేళ్ళయింది. జీవితంలో ఇటువంటి సంఘటన ఒహటి జరుగుతుందని వెంకట్రావు కలలో కూడా ఎన్నడూ అనుకోలేదు. "మా అబ్బాయి సరస్వతీ ప్రసన్నుడు. పెరిగి పెద్దవాడై కుటుంబానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తాడు," అనేవారు వెంకట్రావు తల్లీ దండ్రీ వెంకట్రావు కూడా అది నిజమేనని నమ్మేవాడు వాళ్ళ ఆశీర్వచనం ప్రకారం అలాగే జరుగుతుందనీ అనుకునేవాడు అదే విధంగా కలలు కంటూ ఉండేవాడు. పుస్తకాలే తన ప్రపంచం అనుకుని ఒక్క ఏడాది కూడా తప్పకుండా ప్రతి పరీక్షా ప్యాసయి బి ఏ. దాకా వచ్చాడు మొదటి సంవత్సరం పూర్తయిపోయింది. వెంకట్రావు జీవితం అంతవరకూ సక్రమంగానే సాగిపోయింది. ఇక ఒక్క ఏడాది గడిస్తే అయుధ పాణుడై వెంకట్రావు ప్రపంచం మీదకు దండయాత్రకు బైల్దేరుతాడు. తన తెలివి తేటలకు మెచ్చి భగవంతుడు పెద్ద ఉద్యోగం వచ్చేదారి చూపిస్తాడు. దాంతో తన స్వప్నం ఫలిస్తుంది ఇతరులు తనమీద పెట్టుకున్న ఆశ ఫలిస్తుంది.

కాని అటువంటిదేమీ జరుగలేదు. అందుకు కారకుడు ఒకవిధంగా వెంకట్రావే ఐనప్పటికీ ఆ నేరం అతనిమీద మోపటానికి వీల్లేదు. జీవితంలో ఎప్పుడు ఏ క్షణం ఎలా పరిణమిస్తుందో ఎవరూ చెప్పలేరు. వెంకట్రావు రెండవ సంవత్సరం పరీక్షలకు వెళ్లలేదు. అంతే, అందుకు కారణం ఏమో, ఎందుకు వెళ్ళలేదో అతనికే తెలియదు. పరీక్షలు మర్నాడనగా అంతవరకూ చిట్టచివరి క్షణంవరకూ వెంకట్రావు అందు నిమిత్తమై సన్నద్ధుడౌతూనే ఉన్నాడు. కాని తీరా రావలసిన క్షణం వచ్చేసరికి వెంకట్రావు

నిశ్చయం మారిపోయింది. అతని శిరస్సులో హఠాత్తుగా భయంకరమైన తుఫాను ప్రారంభమయింది కోటానుకోట్ల ఆలోచనలు హోరుగాలిలో జుట్టు విరబోసుకున్న చెట్లలాగా భయంకర నాట్యంజేస్తూ కోటానుకోట్ల ఆలోచనలు. ఆ ఆలోచనల తుఫానులో పడి వెంకట్రావు ఎక్కడికో కొట్టుకుపోయాడు. వెంకట్రావు జీవితం పూర్తిగా మారిపోయింది. గతం అనేది పూర్తిగా అతని జీవితంనుంచి తుడిచిపెట్టబడింది

ఆ క్షణంనుంచీ వెంకట్రావు మరొక వెంకట్రావు అది వెంకట్రావు మరొక జన్మ జీవితంలో ప్రతివ్యక్తినీ కూడా హఠాత్తుగా ఏదో ఒక క్షణంలో ఇటువంటి తుఫాను ఎదుర్కొని ఉంటుంది ఒక ప్రపంచంనుంచి మరొక ప్రపంచంలోకి వెళ్లటానికి దోవ అది. పిరికివాళ్లు దానినుంచి తప్పకుంటారు ధైర్యవంతులు అందులోపడి కొట్టుకుపోతారు. పర్యవసానం తెలుసుకునేదాకా దాన్ని వదలరు.

ప్రస్తుతం వెంకట్రావు అదే తుఫానులో ఇంకా ప్రయాణం చేస్తున్నాడు ఎక్కడో ఎప్పుడో అంతిమ క్షణంలో ఏదో చిన్న వెలుగు కనపడవచ్చు కనపడక పోవచ్చు. ఆ వెలుగు చూడకుండానే వెంకట్రావు హఠాత్తుగా చీకట్లో అంతర్ధానం కావచ్చు ఐతేనేం ఆ చీకటే వెలుగు ఔతుంది కాని జరగబోయే ఆ పరిణామం వెంకట్రావుకు తెలియదు వెంకట్రావు దేన్నీ ఆశించటంలేదు కేవలం ఒక సాహసికుడుగా మాత్రమే తుఫానులో ప్రయాణం చేస్తున్నాడు తుఫాను భీభత్సాన్ని ఆనందిస్తూ నడుస్తున్నాడు మధ్యమధ్య తలక్రిందులై పిల్లిమొగ్గలు వేస్తూన్నాడు ఆ దృశ్యం చూసేవాళ్లకు చాలా వింతగా ఉంటుంది వెంకట్రావుకు మతిపోయిందేమో అనిపిస్తుంది అటువంటి సందర్భాలలోనే వెంకట్రావు విదూషకుడిలా మారిపోతాడు. ఏం చెయ్యటానికీ తెలియక చెయ్యరాని కోతి చేష్టలన్నీ చేస్తాడు

ఎంత సాహసించి తుఫానులో ప్రయాణాలు చేయటానికి తలపడినప్పటికీ ఇటీవల బయల్దేరిన యాత్రికుడు కనుక వెంకట్రావుకు ఇంకా పరిపక్వదశ రాలేదు వెంకట్రావు మనస్సు ఇంకా హిమపర్వతంలా మారలేదు. అంచేతనే ఇతరులు తన్ను చూసి నవ్వుతున్నప్పుడు వెంకట్రావు బాధపడకుండా ఉండలేకపోతున్నాడు. ఆచ్ఛాదన లేకుండా ప్రపంచంలో అడుగుపెట్టలేక పోతున్నాడు. పోస్టుబాక్సులను చూసి భయపడడానికూడా అదేకారణం.

ప్రస్తుతం వెంకట్రావు నడుస్తున్న సందులో పోస్టుబాక్సు లేమీలేవు వెంకట్రావు ఉత్సాహంగా నడుస్తున్నాడు. ఇవాళ తనముఖం మందారపువ్వులా కనపడిందన్న సంతోషం అతని ఉత్సాహాన్ని మరింత అధికతరం చేస్తూ ఉంది. ఇవాళ చాలా మంచిరోజు ఆశ్చర్య దేవత అడుగడుగునా సాక్షాత్కరిస్తుంది. కనీ వినీ ఎరగని ఆశ్చర్య సంఘటన జరిగి తీరుతుంది వెంకట్రావు అదే ఆలోచనల మధ్య ఊపిరి సల్పకుండా నడుస్తున్నాడు.

సందు చిట్టచివరికి వచ్చేసింది ఆ సందు దాటి మరో సందులో ప్రవేశించబోతున్నాడు. అంతలోనే జరిగింది ఎదురుచూస్తున్న సంఘటన. సందు చిట్టచివర ఒకచిన్న డాబా ఇంటిముందు అప్పుడే దిగివచ్చిన ఆకాశకన్యకలాగ అందమైన ఒక అమ్మాయి నవ్వుతూ నిలబడి వుంది చామనచాయ శరీరం గులాబీరంగు పరికిణీ కట్టుకుని, మల్లెపువ్వుల జాకెట్టు తొడుక్కుని పైన ఊదారంగు వోణీ వేసుకుని నవ్వుతూ నిలబడివుంది

వెంకట్రావు తనకళ్లు తానే నమ్మలేకపోయాడు. జీవితంలో మళ్ళీ ఈ అమ్మాయి కళ్లపడుతుందని కలలోకూడా అనుకోలేదు. అటువంటిది ఈ రోజున ఈమె హఠాత్తుగా ఇక్కడ సాక్షాత్కరించింది తప్పిపోయిన మధురానుభూతి మళ్ళీ ఈ నాడు అతనిలో ప్రవేశించింది

ఎప్పుడో అయిదేళ్లక్రితం జరిగిన సంఘటన. జీవితం అనేమాటకు వెంకట్రావు అప్పుడే వర్ణక్రమం నేర్చుకుంటూ ఉన్నాడు. ప్రపంచంలో స్వంతకాళ్లమీద నిలబడటం అనే విద్యను వెంకట్రావు అప్పుడే తర్ఫీదు పొందుతున్నాడు. ఆ రోజులలో వెంకట్రావు ఇంకా

అపరిపక్వ దశలలోనే ఉన్న అక్షరం. ఒకానొక మహానగరంలో ఒకరోజు సాయంత్రం వేళ వెంకట్రావు ఒంటరిగా ఎలక్ట్రిక్ స్తంభాల క్రింద నడుస్తూ ఉన్నప్పుడు ఈ అమ్మాయిని చూడటం తటస్థపడింది. చేత పుస్తకాలు పట్టుకుని తల వాల్చుకుని సిగ్గుపడుతూ అమాయకంగా రోడ్డు ప్రక్కన నడిచి వెళ్ళిపోయింది

భగవంతుని సృష్టిలో అయస్కాంత పర్వతాలు మాత్రమే ఉన్నాయి గాని అయస్కాంత వృక్షాలు లేవు. సృష్టిలో నిజంగా అది ఒక లోపమే. ఆ క్షణంలో వెంకట్రావు ఆ అమ్మాయిని అయస్కాంత వృక్షంతో పోల్చుకున్నాడు. ఒక చిన్న అయస్కాంత వృక్షం తన ప్రక్కగా నడిచి వెళిపోయినట్టనిపించింది వెంకట్రావుకు ఒక క్షణంపాటు వెంకట్రావు గజగజా వణికిపోయాడు. గుండె దడదడా కొట్టుకుంది. శిరస్సు పొగలు గ్రక్కింది, మహోద్భుతమైన ఆ ఆకర్షణ తట్టుకోలేక వెంకట్రావు అక్కడే రోడ్డు మీదనే మూర్ఛపోయాడు వెంకట్రావు జీవితంలో మూర్ఛ అనేది అప్పుడే ఆ క్షణంలోనే ప్రవేశించింది.

నిజానికి ఆ అమ్మాయి మరీ అంత విపరీతమైన అందకత్తెకాదు. కాని ఒక విలక్షణమైన అందం ఆమెలో ఉంది. ఆ అందాన్ని మరింత ఇనుమడింప చేస్తూ ముఖంమీద ఛాయా మాత్రంగా కనపడే విషాదరేఖ అదే వెంకట్రావును అనేక విధాల ఆకర్షించింది

ఆ మహానగరంలో ఉన్నంత కాలం వెంకట్రావు ఆమె కోసం తపస్సు చేశాడు. రోజూ సాయంత్రంపూట ఆమె కోసం ఎదురు చూస్తూ ఉండేవాడు. సరిగ్గా ఆరుగంటలకు ఆ అమ్మాయి ఆ దోవన వచ్చేది కన్నెత్తి ఒక్కసారి మాత్రం వెంకట్రావు ముఖంలోకి చూసేది అంతే, ఆ తర్వాత తల వాల్చుకుని తన దోవన తాను వెళిపోయేది. ఆ ఒక్క చూపు కోసమే వెంకట్రావు రోజూ ఆమె కోసం ఎదురు చూస్తూ ఉండేవాడు. ఆ చూపులో వ్యక్తమయిన భావాలు మట్టుకు వెంకట్రావుకు ఇంతవరకూ బోధపడలేదు.

అసలు వెంకట్రావుకు ఇప్పటికీ కూడా ఆమె ఎవరో తెలియదు ఆమె వెనక్కాలే నడుస్తూ ఆమెనుగూర్చి వెంకట్రావు పలు విధాలుగా ఊహించుకునేవాడు ఆమె పేరు సరోజ అయి ఉంటుంది. కాదు పొరపాటు ఆమె పేరు వినపడ్డప్పుడు రోడ్డుమీద రొమ్ము విరుచుకు తిరిగే నాగరిక కన్యలు గుర్తుకు వస్తారు. సీత! చాలా చక్కని పేరు. అశోక వృక్షంక్రింద సీత అన్ని విధాలా అనువైన పేరు....ముమ్మాటికీ ఆ అమ్మాయి పేరు సీత అయిఉంటుంది. బహుశా ఆమె కూడా తన కుటుంబంలాంటి కుటుంబంలోనే పుట్టి ఉంటుంది తన తండ్రిలాగే ఆ అమ్మాయి తండ్రి కూడా స్కూలు మాస్టరి ఉద్యోగం చేస్తూ ఉంటాడు లేదా చిన్న సైజు ప్రభుత్వ నౌకరి ఏదో చేస్తూ ఉంటాడు ఆ అమ్మాయి ఉండే ఇల్లు పెంకుటిల్లయి ఉంటుంది అది తప్పకుండా అద్దె ఇల్లయి ఉంటుంది ఆ ఇంటి వెనక పెరట్లో తులసికోట ఉంటుంది తులసి కోటకు రోజూ సాయంత్రంపూట ఆ అమ్మాయి నీళ్లుపోస్తూ ఉంటుంది తనలాగే ఆ అమ్మాయి క్కూడా అక్కాచెల్లెళ్లూ, అన్నలూ, తమ్ములూ, ఎక్కువమంది ఉండి ఉంటారు వాళ్ల అమ్మ జబ్బుతో మూలుగుతూ మంచంమీద పడి ఉంటుంది ఇంటిల్లిపాదికీ ఆ అమ్మాయి వంటవండి చాకిరీచేసి హైస్కూలుకు వెళ్ళి వస్తూ ఉంటుంది. పిల్లలకు, చదువులూ, పెళ్లిళ్లూ పూర్తిచేయలేక వాళ్ళ నాన్న మనోవ్యధతో క్రుంగి కృశించి ఉంటాడు.

అదే నిజమైతే ఇద్దరి జీవితాలూ కలుసుకునేటందుకు ఆస్కారం ఉంది తను ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోవచ్చు ఒకవేళ ఆ అంచనాలన్నీ నిజం కావేమో? ఐతే ముఖం మీద ఆ విచారరేఖ ఏమిటి? పుట్టుకతోనే వచ్చిన విచారరేఖా అది? ఈ ప్రాపంచిక వ్యవహారాలతో నిమిత్తం లేనిదా అది?

వెంకట్రావు అలాగే పరిపరి విధాల ఊహాగానం చేస్తూ ఆ అమ్మాయిని వెంబడిస్తూ వెళ్లేవాడు కాని ఒక్కరోజు కూడా ఆ ఉభయులూ ఎదురుబదురుగా నుంచుని ఒకరి ముఖంలోకి

మరొకరు నిర్భయంగా చూసుకోవటం జరగ లేదు ఆ ఉభయులూ ఒక్కసారి కూడా మాట్లాడుకోలేదు

చివరకు వెంకట్రావు ఆ మహానగరాన్ని విడిచి హఠాత్తుగా వెళ్ళిపోవలసిన రోజు వచ్చింది.

వెంకట్రావు అనేక మహానగరాలు చూశాడు అనేక నగరాలమీద దండయాత్ర చేశాడు ఒక నగరం తర్వాత మరొక నగరం ఏ నగరంలో ఎన్నాళ్లు ఉండటం జరుగుతోందో అతనికే తెలియదు. హఠాత్తుగా అర్ధరాత్రి ఒక నగరం విడిచి మరొక నగరం జేరుకుంటాడు ఈ ఐదేళ్లలోనూ వెంకట్రావు జీవితం ఆ విధంగానే సాగుతూ వచ్చింది చిట్టచివరి రోజూ వచ్చేసరికి వెంకట్రావు భయపడిపోయాడు అలా భయపడుతూనే వెంకట్రావు ఒక నిశ్చయం చేసుకున్నాడు ఆ రోజు సాయంత్రం ఆ అమ్మాయిని కలుసుకొని తన మనోగతాభిప్రాయాలన్నీ నిర్భయంగా ఒక్కసారి ఆమె ముందు వెల్లడించాలి. ప్రపంచంలో ప్రేమికుల సంప్రదాయాన్ననుసరించి అందుకు అనుగుణ్యమైన విధానాన్ని అంతకు ముందే వెంకట్రావు ఆచరణలో పెట్టుకుని ఉంచుకున్నాడు అరునెలల క్రితం వెంకట్రావు ఒకరోజు అర్ధరాత్రి తెల్లవార్లూ మేల్కొని ఒక ప్రేమలేఖను సృష్టించి ఉంచుకున్నాడు. కాకపోతే ఇంతవరకూ దాన్ని అందజేయటం మట్టుకు జరగలేదు ఈ రోజునైనా ఆ లేఖను ఆమె చేతుల్లో ఉంచాలి నిజానికి వెంకట్రావు ప్రేమలేఖల ఘట్టం చిత్రవిచిత్రమైనది, వెంకట్రావు ఇప్పుడైతే ప్రేమలేఖల గొడవ విని నవ్వుకుంటాడు కాని అప్పుడు ఆ రోజులలో ఆ అమ్మాయిని కలుసుకున్న మొట్టమొదటి రోజునే రాత్రి తెల్లవార్లూ మేల్కొని భయంకరమైన ప్రేమలేఖ ఒకటి వ్రాశాడు. దాన్ని ఆ మర్నాడు ఆ అమ్మాయికి అందజేయాలని అతని ఉద్దేశం. కాని మర్నాడు కాదు, కాదుగదా ఇంతవరకూ కూడా అందజేయలేకపోయాడు రోజూ సాయంత్రంపూట ఆ ప్రేమలేఖను జాగ్రత్తగా మడిచి జేబులో పెట్టుకుని, వెంకట్రావు ఆమెను అనుసరిస్తూ నడిచి వెళ్లేవాడు. నాలుగైదు రోజులయేసరికి జేబులో ఉన్న ప్రేమలేఖ నలిగి మాసికలుపడి చిరిగిపోయేది. వెంటనే హుటాహుటి గదికి పరిగెత్తుకుంటూ వెళ్ళి వెంకట్రావు సరికొత్త కాపీ ఒకటి తయారుచేసేవాడు. అదే ప్రేమలేఖను ఉన్నది ఉన్నట్టు పరిశుభ్రమైన మరొక తెల్లని కాగితంమీద జాగ్రత్తగా వ్రాసి జేబులో పెట్టుకుని ఆ అమ్మాయిని అనుసరించి వెళ్ళేవాడు. నాలుగైదు రోజులకే ఆ లేఖ మళ్ళీ మాసిపోయేది వెంటనే వెంకట్రావు మళ్ళీ మరొక కాపీ తయారు చేసేవాడు అలా అధమం అరవైసార్లయినా కాపీ తీసి ఉంటాడు కాని అదిమాత్రం ఆ అమ్మాయికి అందలేదు ఆ ప్రేమలేఖ తాలూకు చిత్తు ప్రతి ఒకటి వెంకట్రావు దగ్గిర ఇంకా ఇప్పటికి కూడా ఉంది

చిట్టచివరి రోజున వెంకట్రావు ఆమెకోసం ఎదురుచూశాడు కాని ఆ అమ్మాయి రాలేదు. బరువెక్కిన హృదయంతో ఆ రోజు రాత్రే వెంకట్రావు ఆ మహానగరాన్ని విడిచి వెళ్ళిపోయాడు. తర్వాత మళ్ళీ ఆ అమ్మాయి ఈ నాటికి ఇక్కడ కనపడింది.

వెంకట్రావు ఇంకా అక్కడే అదే సందులో యథాప్రకారం శిలావిగ్రహంలాగా నిలబడి ఉన్నాడు

ఆ అమ్మాయి ఇంకా గుమ్మంలోనే నిలబడి ఉంది. ఆమె ఇప్పుడు బాగా మారిపోయింది. వెనుకటికంటె కొంచెం పెద్దదయింది ఆ రోజులలో కనపడే అమాయకత్వం ఇప్పుడు ఆమెలో లేదు. కాని ముఖంమీద విచారరేఖ అలాగే ఉంది. బహుశా ఆమెకు పెళ్ళయి ఉంటుంది. ఇది అత్తవారి ఇల్లయి ఉంటుంది. భర్త మంచి ఉద్యోగం చేస్తూ ఉంటాడు.

వెంకట్రావు ఇంకా అలాగే ఆలోచిస్తూ నిలబడి ఉన్నాడు. ఆ అమ్మాయి ఒక్కసారి అతన్ని చూసి నవ్వింది. భయంకరమైన విషాద గీతం ఒకటి వికసించినట్టుగా ఉంది ఆ నవ్వు ఇంతలో ఇంట్లోనుంచి పిలుపు వినపడింది ఆ అమ్మాయి లోపలికి వెళిపోయింది. మళ్లీ ఆమె కనపడకపోవచ్చు కాని వెంక

ట్రావు ఇప్పుడు నిరాశలోపడి క్రుంగిపోయే మనిషికాదు. జీవితంలో మళ్ళీ ఒకసారి అమె కనపడింది. అంతే చాలు ఆ జ్ఞాపకం ఒక్కటే చాలు. అదే సంతృప్తితో వెంకట్రావు అక్కడ నుంచి కదిలాడు.

కాని మరుక్షణం విపరీతమైన దుఃఖం అతన్ని ఆవరించింది. వెంకట్రావు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయాడు వెనక్కి తిరిగి, వెంకట్రావు గబగబా గదికి వెళ్ళిపోయాడు. గదిలో ప్రవేశించి పసిపిల్లవాడి లాగ ఒక్కపెట్టున భోరున ఏడ్చాడు

జీవితంలో వెంకట్రావు ఏడ్వటం అదే మొట్టమొదటిసారి.

(ఇంకా ఉంది) ★

కలగూరగంప కలయికలు

# ఎన్నికల పొత్తులు - ప్రతిపక్షాలు

వి. యస్. ఆచార్య

ఎన్నికల జ్వరం తీవ్రంగా వ్యాపించేసరికి వివిధ రాజకీయ పక్షాలలో సంచలనం బయలుదేరింది ఇంతదాకా నిద్రపోతూవున్న పార్టీలు, వ్యక్తులు, వార్షిక సభలూ జరుపుకుంటూ ఎన్నికల పొత్తులు, లేదా ఎన్నికల్లో సర్దుబాట్లు గురించీ పత్రికల్లో వార్తలు నింపేస్తున్నారు. కాని ఈ అలజడిలో ఏదో అసహజత్వం, కృత్రిమ ప్రయత్నాలు బాగా ద్యోతకమవుతూ వున్నాయి. 1952లో జరిగిన ప్రథమ ఎన్నికలనాటి వాతావరణం వ్యాపింప జేయడానికి ఎన్ని ప్రయత్నాలు జరుగుతున్నా ప్రజల్లో ఏమీ సంచలనం కనిపించడం లేదు. దేశంలో మేథావులూ, మధ్యతరగతివారూ అధికారంలో వున్న పార్టీకి ఎలాంటి ప్రతిఘటనా కనిపించనందుకు బాధపడుతున్నారు. సామాన్య ప్రజలు ఎలాగూ కాంగ్రెసు అధికారంలోకి రాక తప్పదన్న నమ్మకంతో ఈ ఎన్నికలను గురించి ఏమీ ఆలోచించడం లేదు పోతే ఇక ఈ ఎన్నికలపట్ల అత్యాసక్తి ప్రదర్శిస్తున్నవారు టిక్కెట్టులకోసం తాపత్రయపడుతున్నవారూ,వారి అనుయాయులూ,బంధుమిత్రులూ మాత్రమే!

ఆసియాలో ప్రజాస్వామిక వ్యవస్థ మనుగడకే ప్రత్యక్ష సవాలుగా ఇండియాలో మొట్ట మొదటి జనరల్ ఎన్నికల విజయం, దాని ఫలితాలపట్ల ప్రపంచప్రజలు ఆసక్తితో ఎదురుచూచారు. ఈ నాడు ఐదేళ్ల తరువాత, రెండవ ఎన్నికలనాటికి దాన్ని గురించి ఆలోచించే నాథుడు లేదు ఇందుకు చారిత్రకమైన కారణాలు ఉన్నాయని అధికారంలో వున్న పార్టీ వారూ వారి అనుయాయులూ సమర్థించుకుని జబ్బలు చరుచుకున్నప్పటికీ ప్రజాస్వామిక వ్యవస్థయొక్క ఆరోగ్యకరమైన అభివృద్ధిపట్ల ఆసక్తివున్నవారెవ్వరైనా నేటి ఎన్నికల పట్ల భారత ప్రజల్లో కనిపిస్తున్న నిరుత్సాహంలో దేశపు రాజకీయ జీవితంలోనే కనిపిస్తున్న ఒక జాడ్యం (Cancer) గ్రహించగలుగుతారు. అదే నేటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక వ్యవస్థల్లో రోజురోజుకూ నశించిపోతున్న ప్రతిఘటనా శక్తి (Element of Opposition) అన్ని రకాల ప్రతిఘటనల్నీ అణచిపారవేస్తూ దేశంలో పెరిగిపోతున్న వ్యక్తిత్వపు నియంతృత్వం (Dictatorship of the individual) ఏ రంగంలోనూ వ్యక్తిత్వపు ఛాయలు బలీయంగా పాతుకొని సైద్ధాంతిక వివేచనా శక్తికీ, ఆలోచనకూ అంతరాయం కలిగిస్తున్న మత్తు మందు·

# చతురస్రం

**సీరియల్ కథ**

[అజంతా వ్రాసిన మొదటి అధ్యాయం క్రిందటి వారం ప్రచురించాము. ఇది రెండవ అధ్యాయం. రచన శ్రీ వేల్చూరి సుబ్రహ్మణ్యం.]

(గత సంచిక తరువాయి)

(2)

అతను ఆదిమ మానవుడన్నా అయిఉండాలి, లేదా రానున్న తరానికి ప్రాతినిధ్యం వహిస్తుండాలి. ఈ రెండూ కాకుంటే, నులక మంచంలా గజిబిజిగావున్న అతని ముఖం అతనికే ఒక్కొక్కనాడు మందారపువ్వులా దేనికి కనిపిస్తుంది?

వెంకట్రావు కన్ను—చతురస్రంలా వున్న అతని గది కిటికీలోనుండి ఎట్టెదుటవున్న మొండిగోడల మధ్య నిటారుగా చూస్తుండడం దేనికి? ఆ గోడలు ఎవరు కట్టుకున్నారో వారు లేరు ఇప్పుడు ఇటుకఇటుకకూ మధ్యన దట్టంగాపెట్టిన సున్నంజీరకూడా కనుపించడం లేదు ఆ నాలుగే నాలుగు గోడలమధ్య—తూరుపుదిక్కు గోడ మధ్యనుంచి ఇటుకలు కూలడం ప్రారంభమై వుంటుంది.

అక్కడే సింహద్వారం ఉండొచ్చు. ఆ పడిపోయిన గోడ—అక్కడ కుడి ఎడమల చీలి, నెరియలు పడి అర్ధవర్తులాలవలె కనుపిస్తున్నది. మధ్యలో ఏవో గదులున్నట్టే ఆనవాళ్లు పొడకట్టుతున్నాయి. దశదశాబ్దాల క్రితం గదికొక పోలీసో, గజదొంగో అక్కడ మకాంచేసి వుంటారు. కాకుంటే ఒక 'కలిగినవాడు' గదికో ఇల్లాలును కట్టుకొని అక్కడ కాపురం చేసి వుండొచ్చు ఏమైనా ఆ మొండిగోడల వాలకంచూస్తే—అణచివేయబడిన ఒక ఉదంతాన్ని సవిస్తరంగా చెప్పడానికి అవి నోళ్ళు తెరుచుకుంటున్నట్టున్నాయి.

వెంకట్రావు చూపు — లోతుకుపోయిన ఆ సీలికళ్లు వందమైళ్ళ దూరానవున్న ఏదో పెద్ద నల్లటి మ్రోడుమీద, విడిది దిగినట్టువున్న పచ్చటికొమ్మల అయస్కాంత వృక్షాన్ని, ఆ చెట్టు చిటారుకొమ్మమీద కుప్పిగంతులువేస్తూ ముద్దొస్తున్న మర్కటాన్ని చూస్తున్నట్టుంది నిద్రలేచీ లేవడంతో కాలకృత్యాలు ముగించుకొన్నాడు కిటికీలోనే కూర్చుని పంట్లాం జేబులోనుంచి ఒక కాగితపుబంతిని వెలికి తీశాడు. కొడికట్టిన వత్తులవలె ఉన్న ఆ అక్షరాలు, బారులు బారులుగా కాటుక కొండలలా కనుపించేసరికి ఏదో పెద్ద అలసటతో ఆ కాయితాన్ని నలుపబోయి, "అమ్మో" అని దిక్కులు దద్దరిల్లేట్టు కేకలేశాడు.

చిత్తుకాయితాల్ని నలిపి పారెయ్యడం, నలుగురి గొంతులు నులిమివెయ్యడం కష్టం. అతను జంతువుకాదు, గడ్డిలా నమిలివెయ్యడానికి

అనాసక్తుడు తిరునాళ్ళకుపోయి, పోయినవాడు పోయినట్టే తిరిగి వచ్చినట్టు — ఆ కాయితపుబంతి వదులాదులుగా ముడిపడివున్న అతని వ్రేళ్ళమధ్య పంజరంలోని చిలుకలాగా ఏదో ఒక్కొక్కపలుకు, పలుకుతున్నది. 'ఇంత భయంకరమైన ప్రేమలేఖ రాసి, మాకు ముక్కు, కళ్ళూ, నోరూ, నాలుకలూ కట్టి — నీ చేత్తో నీవు మమ్మల్ని మా సంకేతాన్ని చేర్చలేక

పోయినావు కనీసం పోస్టుడబ్బాలో పారేసినా రెక్కలు కట్టుక పోయేవాళ్ళం....మేము పచ్చ పచ్చగా ఆ సంగతులు జ్ఞాపకం చేస్తుంటాము'

కాయితంమీద ప్రతి అక్షరం మాట్లాడు తున్నది ఆకాశ కన్యకలాంటి ఆ అమ్మాయిని-ఆ నిగనిగను అవీ చూచినట్టు - అసలు ఆ ఆ అక్షరాలే గులాబీరంగు పరికిణీ, మల్లెపూల జాకెట్టు, ఊదారంగు వోణీ వేసుకున్నట్టు వెంకట్రావుకు సాక్షాత్కరించాయి. అయినా అవి అక్షరాలన్న స్ఫురణ కలిగించిన విషాదరోదన అతన్ని నఖశిఖపర్యంతం గుడ్డను నులిమేసి ఊతికినట్టు, ఊతకడం మొదలైంది

ప్రతి అక్షరమూ పొగలు క్రక్కుతున్నది కాయితంబంతి బ్రద్దలవుతున్న అగ్నిపర్వతం లాగా, బహుళపంచమి జ్యోత్స్నలాగా భయ పెట్టింది. కాదు, అసలు ఆ పొగలుచూస్తుంటే, అతను ప్రయాణంచేస్తున్న రైలు ఇంజన్‌లా, అవి ధుమధుమ లాడుతున్నాయి

అతను గదిలో, అక్షరాలా నాలుగుగోడల మధ్యన ఉన్నట్టే లేడు మొండిగోడలు, చెట్లు, కొండలు, మిట్టలు, ఊళ్ళూ, టెలిగ్రాఫు స్తంభాలు అన్నీ వరుసగా కదిలిపోతున్నాయి. ఒక్కసారి కళ్లువిప్పేసరికి. అటూఇటూ జనం, పై వరుసలో పలుపులు, పెట్టెలు, బుట్టలు, ఏవేవో కనుపించాయి.

ఇప్పుడు వెంకట్రావు కూర్చున్న రైలుపెట్టె కదిలిపోతున్నది. మాట్లాడుకుంటున్న వారి గొంతులు హెూరుగాలిలో స్పష్టతను కోల్పో తున్నాయి. పాలకోసం ఏడుస్తున్న పిల్లవాడు తల్లివొళ్ళో నిలవక — ఉగ్గపెడుతున్నాడు వెంకట్రావు ప్రక్కనే ఒక లావుపాటి మనిషి గురకపెడుతూ, తిన్నగా వొరిగి వొరిగి, వెంక ట్రావు మీదనే పడబోతున్నాడు. గడ్డం పెరిగి వుంది. అతని కళ్ళజోడుతాడు ముడి వొదులై ముక్కుమీదనుంచి జారి, మీసాలను అంటు కొని అది వ్రేలాడుతున్నది. ఎంత జారినా, అంత లావుమనిషిమీద ఎక్కడో అక్కడ అది చోటు చూచుకో గలదనిపిస్తుంది. ఇంకా మూడుస్టేషన్లు పోతేనేగాని, వెంకట్రావు దిగ వలసిన స్టేషన్ రాదు.

ఈ సారి బండి ఆగగానే ఒక్కసారి నిల్చుని వొళ్లు విదలించుకొని కళ్లజోడు సవరించుకుని పేపర్ కుర్రాణ్ణి పిలిచి ఒక పత్రిక కొన్నాడు. పత్రికకు డబ్బులిచ్చి ఆ పత్రిక అతని చేతిలోకి వచ్చిరాక ముందే ఎదుటిబల్లమీద కూర్చున్న వ్యక్తి ''ఒక కాయితం ఇవ్వండి'' అన్నాడు. రైలు కదిలింది టీ, కిళ్ళీ, సిగరెట్లు కుర్రాళ్ళ నెత్తిమీది పెట్టెలు పరుగెత్తుతున్నాయి

పేపర్ అడిగినాయన మాట వినిపించుకో కుండా వెంకట్రావు దాన్ని విప్పి ముఖానికి అడ్డంగా పెట్టుకొని, రెండుకొసలు రెండు చేతు లతో లాగి బిర్రుగా పట్టుకొన్నాడు

పేపర్ అడిగినాయన వెంకట్రావుకు కను పించడు వాళ్ళిద్దరి మధ్యన పత్రిక గోడ కట్టి నట్టున్నది. అయితే ఆయన మాత్రం కొంగలా వొంగి పైకి కనుపిస్తున్న ఆ రెండు పేజీల్లో ఏ మూలన్నా వారఫలాలు ఉన్నాయేమోనని రిక్కించి చూస్తున్నాడు కొంచెం కొత్తవాళ్లు రావడంతో బల్లమీద వొత్తిడి ఎక్కువై-ఆ పెద్ద మనిషి మళ్ళీ కొంచెం వెనక్కు అవసరానికి తగ్గట్టు గట్టిగా అనుకొని, అటూ ఇటూ వొత్తు కుని కూర్చుని ''ఈ పెట్టె కాకుంటే ఇంకో పెట్టె కనుపించడం లేదా వీళ్ళకు'' అని విసు క్కొన్నాడు. నెట్టుక కూర్చోవడం అనాగరక లక్షణం, అంటూ తను ఇటూఅటూ కూర్చున్న వారిని నెట్టి కూర్చున్నాడు

అతనికి ప్రక్కగా కూర్చున్న వ్యక్తి ''మీరు వారఫలాలు చూస్తుంటారా?'' అన్నాడు.

''అవునండీ. కొన్ని దాఖలాలు చూచుకుంటే వాటిని కాదనలేకపోతున్నాను?''

''వాటి బలం మన నమ్మకంలో వుంది కాని, వాటిల్లో ఏమున్నదండీ?'' అంటూ కొంచెం మధ్యవయస్కుడు పెదిమ విరిచాడు. ఈయనకు పెద్దగా రేగిన జుట్టూ, మూతలున్న జేబు చొక్కా, నల్లని నిక్కరూ ఉన్నాయి. ప్రక్కవాళ్ళను వొత్తిడిపెట్టడం దేనికని, దగ్గర స్టేషన్లోనే దిగిపోతున్నానని కిటికీ తలుపు పట్టు కొని నిల్చున్నాడు.

వెంకట్రావు కాయితాన్ని నిటారుగా ఒక్క మడతకూడా లాగి గోడకట్టుకున్నట్టు పట్టు కొన్నాడు. ప్రక్కచూపు చూస్తున్న పెద్దమనిషి విస్తుపోతూ—వెంకట్రావును పరీక్షగా చూస్తు న్నాడు. నిల్చున్న పెద్దమనిషికి ఎదురుగా ఒక లావుపాటి పెద్దమనిషి కూర్చున్నాడు. చాలా హుందాగా కనుపడుతున్నాడు; షేర్వాణీ, చేతి వుంగరాన్ని బట్టిచూస్తే-హఠాత్తుగా నూనె వర్త కంలో చెయ్యి తిరిగినవాడనిపిస్తుంది; కాని అతను "ఘరానా జనం" అన్న చిత్రాన్ని గురించి తర్కిస్తున్నాడు. నిల్చున్నాయన ఆయన సంభాషణను వింటూ-వాళ్ళ రామా రంలో —"ఆకలి" చిత్రపు "ఔట్ డోర్" షూటింగ్స్‌కు - "జగతీ" వారు వచ్చినప్పుడు అతనిచ్చిన సలహాలను పాటించని మూలాన ఆ పిక్చర్ దెబ్బతిన్న వైనం చెబుతున్నాడు. బిచ్చగాడి చేతిలోని "బొచ్చె" హఠాత్తుగా చేజారిపడి పగిలిపోవడం చూపడంకంటే, బిచ్చగాడు తల నేలకు బాదుకొని తునాతునక లవుతున్న ఘట్టం చూపిస్తే— బాగా కలెక్షన్ వస్తుందన్నాట్ట. షేర్వాణీ వేసుకున్న పెద్ద మనిషి - "అవునండీ మీరు చెప్పిన మాట వాస్తవం అంతటితో బిచ్చగాడు అంతమైతే కథ ఏంకావాలి? 'కరుణ'కు ఎక్కడన్నా క్లైమాక్సు, ఆన్టి క్లైమాక్సూ చూపాలికదా! ఈ "షాట్" తరువాత ఏమొస్తుందో మనం పిక్చర్ తీసేటప్పుడు కథనుబట్టి ఊహించు కుంటాం" అని - అసలు "షాట్స్" ఎట్లా డివైడ్ చేస్తారో, సెట్సుమీద ఎట్లా పని చెయ్యాలో చెప్పుకొస్తున్నాడు.

ఒక్క వెంకట్రావు తప్ప - రైలు పెట్టెలో ముందు వరుసలో కూర్చున్నవాళ్లంతా ఆయన వంక సగౌరవంగా చూస్తున్నారు ఆ పెట్టెలో కొందరు సినిమా చూడని అభాగ్యులూ లేక పోలేదు; సినిమాలు చూచినా, వాటిని తియ్యడం లోని విశేషాలు ఎరిగినవాండ్లు ఆ బండ్లో లేరు, అందుకే ఆయన వాళ్ళను ఆకర్షించాడు. ఒక రైతే ఆ చిత్ర వ్యాఖ్యాత వంక తదేక దృష్టితో చూచీ, చూచీ-"మిమ్మల్ని ఎక్కడో చూచినట్టుంది" అన్నాడు

"మొన్న రిలీజ్ అయిన పిక్చర్లో చూచి వుంటారు; ఆ కొట్టుకున్నవాళ్లలో కొట్లాట సీన్లో ప్రవేశించి, నాయకుణ్ణి ప్రతినాయకుణ్ణి విడ దీస్తాను" అన్నాడు.

వింటున్నాయన ఏమీ అనలేదుగాని, ఇంకొ కడు అప్పటికప్పటికి ఆ ప్రసంగంలో తల దూర్చి-"నిజంగా, కొట్లాటలు పొడుగవకుండా విడదీసినందుకు మీకు ధన్యవాదాలుఅర్పించా" లన్నాడు. అతనిది దాటిపోయిన స్టేషనుకు ప్రక్కనేవున్న దావులూరు. గత మాసంలో ఆ వూళ్ళో ఇద్దరు పాలేళ్లు పొలంగట్టున గుద్దు కుంటుంటే అతను అడ్డం పోయిన నేరానికి, ఒక దెబ్బ గూడమీద తగిలి విరిగిపోయిందట. ఆ గూడను అతను అందరికీ చూపించాడు. "అయ్యో పాపం" అన్నట్టు పెద్దమనిషి అందరి పక్షాన జాలిని వెలిబుచ్చాడు

నిల్చున్నాయన -`ఆ గ్రామీణుని "ఎక్కడికి పోకడ?" అని ప్రశ్నించాడు అతను 'పట్నం' అని సమాధానమిచ్చాడు ఒక్క క్షణం ఆగి అతను కొంచెం నిల్చున్నాయనను వొత్తుక కూర్చోమని చోటు యిచ్చి, ఎదురుగావున్న పెద్ద మనిషికి బొడ్లోనుంచి ఒక కాయితం తీసి చూపిస్తూ, "ఈ అడ్రసు తమకు గుర్తేనా అండీ?" అన్నాడు

పెద్దమనిషి-"ఓ"అంటూ,"అవును, ఫిల్ము నిర్మాత కృష్ణమూర్తిగారా? మాకు తెలుసు వారితో మీకేం పని?..."

గ్రామీణుడు గొంతు సవరించుకొని, "ఈ మధ్య మావూరు వొచ్చి పదివేలు నా దగ్గర పట్టుకెళ్ళారండీ, ఇంకా పంపలేదు. ఇదిగో పంపుతానన్నాడు పెద్దమనిషి!" అన్నాడు.

ఎందుకో ఆయన ముఖం వివర్ణమైపోయింది, వింటుండగానే

కృష్ణమూర్తిగారి పిక్చర్‌కే వీరు "పాటలూ, మాటలూ" వ్రాయను పట్నం పోతున్నారు, కాశీకిపోతూ పిల్లిని చంకన బెట్టుకపోయినట్టు ఈ శనిగ్రహాన్ని దేనికి తగిలించుకున్నానా అని ఆయన కొంచెం వివర్ణుడైనాడు.

కొంచెం ధైర్యం తెచ్చుకొని పెద్దమనిషి "సరేలెండి, ప్రక్క వరుసల పెట్టెలో మా

ఆడవాళ్లు వస్తున్నారు. స్టేషన్ రాగానే వాళ్లను దించి వస్తాను. మీకు వార్ని కలుపుతా లెండి. ఖంగారు పడకండి!'' అని జవాబుచెప్పి, ఒక్క సారి షేర్వాణీ చెరుగుతో ముఖాన్ని విసురుకొని నల్లద్దాల కళ్ళజోడు సర్దుకుని కూర్చున్నాడు

వెంకట్రావు నీళ్ల ఉపరితలాన్ని చూడని చేపలాగా అర్ణవంలో అట్టడుగున ప్రయాణం చేస్తున్నాడు. అతనికి ఎవరితోనూ నిమిత్తం లేదు; అతను ఆ నగరానికి మాత్రం పోవాలని పించి వెళ్లుతున్నాడు భీకరమైన తుఫానులో కొట్టుకొచ్చే ఎండుటాకులా ఎగిరివచ్చి, ముఖ్య పట్టణపు మొగసాల దేవిడీమీద పిట్టలా వాల్తాడు అంతే! అంతే. వెంక ట్రావు ఆ స్టేషన్లో దిగాడు. ఇంతపెద్ద పట్టణంలో అతను ఎక్కడ దిగాలోనన్న ప్రశ్నతో బాధపడలేదు!

ఎప్పుడూ ఎక్కడ దిగాలోనన్న సంకేతం చూచుకొని అతను దిగలేదు; అతని బూట్లు మాత్రం ఎర్రగా, లావుగా, నిగనిగలాడుతూ, దార్లు పసికట్టి, వాటంతట అవే ఎక్కడికి పోవాలో అక్కడికి, అవి నిశ్చయించుకొన్న చోటికి తీసుకుపోతుంటాయి. వెంకట్రావు కొను కున్న పేపర్ తప్ప, అతనికి ఏ సామానుమోతా లేదు! ఒక్కసారి తలుపుతీస్తే గుంపులు గుంపు లుగా సామాన్లతో, సంభారాలతో దిగుతున్న జనంలోనుంచి, శరంలాగా దూసుకుంటూ దిగి పొయ్యాడు ఒక పెద్దమనిషి గొడుగుకర్ర అతని కణతకు కొట్టుకున్నా—అతను లెఖ్క చెయ్యలేదు!

దిగీ దిగడంతోటే మెయిన్‌రోడ్డు తప్పిం చాడు, తారురోడ్డు ప్రక్కనుంచి పోతుండగా, కప్పరకప్పర చీకట్లు క్రమ్ముకొస్తున్నాయి. చీకటి జడలు విరబోసుకుంటుంటే అతనికి చికాకు వేసింది, రాత్రికి.

''బాబ్‌డ్ హెయిర్'' చేయిస్తే ఎంత బాగుం టుంది? అనుకున్నాడు

అంతలో రోడ్డు ప్రక్కని విద్యుద్దీపాలు వరు సగా వెలిగాయి.

అతనికి నవ్వువచ్చింది. ఒక్కడు. ఒక్కడే ఒక్కడు ఆ వీధిలో నిల్చుని దీపాల బారుని చూచి చిరునవ్వు నవ్వుకున్నాడు. రెండడు గులు దాటేసరికి ''జలజమహల్'' బోర్డు కను పించింది. హెూటల్లో అట్టే జనం లేరు.

కౌంటర్ దగ్గర కూచున్న యజమాని వుంగ రాల క్రాపూ, మదతమాయని చొక్కాతో, నిండుగా, పచ్చగా కనుపిస్తున్నాడు. ఆ మెర్క్యురీ లైటు నిగనిగలో అతని కౌంటర్‌మీది గంట తళతళ లాడుతున్నది. గోడలు, బల్లలు, ఆ కాస్త దాంట్లోనే పరిశుభ్రంగాకనుపిస్తున్నాయి. ఇరకాటం ఎక్కడాలేదు; బజారులో కంటే హెూటల్లో ఎంతో విరామంగా ఉన్నది యజ మాని మాట్లాడకుండా, తలవంచుకుని ఏదో చదువుకుంటున్నాడు బయట ఇద్దరు కుర్రాళ్లు హెూటల్ ముందర సరసంగా మాట్లాడుకుంటూ నిల్చున్నారు. వెంకట్రావు — పెద్దగా ఎవర్నీ పిలిచి, ఈ నిశ్శబ్ద గంభీర సౌందర్యాన్ని భంగం చెయ్యదలుచుకోలేదు హెూటల్లో అడుగుపెట్టే సరికి అతనికి జనసందోహమంతా సర్దుమణిగే దాకా, నగరం నిద్రపోయేదాకా ఎక్కడికీ పోవా లనిపించలేదు. ఆ వెలుతురు వంక చూస్తూ కూర్చున్నాడు.

బనీను, నిక్కరు వేసుకుని కడిగిన ముత్యం లాగా వద్నాలుగేళ్ళ కుర్రాడు, ''ఎన్ని కార్లు తెప్పిస్తున్నావురా నాపెళ్ళికి, గోపాల్?' అన్నాడు

గోపాల్ బొద్దంకిలా బిళ్లలా వున్నాడు. అయిదువ్రేళ్లు చూపిస్తూ ''అయిదురా నాలుగు-ఒకటి అనుమానంగా ఉంది—కనీసం నాలుగు కార్లన్నా తెప్పిస్తా''నన్నాడు.

''నీ మొహం ఈ వూళ్ళో గవర్నర్‌కు తప్ప ఎవరికీ పెద్దకారు లేదు మొన్న ముఖ్యపట్నం మని కొత్తరోడ్డు వేశాక దాంట్లో గవర్నర్‌గారి మనుమడుపోతుంటే దాన్ని చూశాను. ఎప్పు డన్నా డ్రైవింగ్ నేర్చుకొని, అట్లాంటి కారన్నా కొనేది లేకున్నా ఎక్కి తీరాలనిపిస్తున్నది'' అంటున్నాడు

ఇంతలో ప్రొప్రయిటర్ గంటకొట్టాడు ''ఇవ్వాళ మన ''జలజ''లు ఎన్ని అమ్మివచ్చా వురా బుద్ధూ!'' అని తల ఎత్తకుండా ప్రశ్ని స్తుంటే ''వది పోయినయ్ సార్! పైసలు అమ్మగారి కిచ్చేశాను సార్'' అంటూ ముత్యం లాంటి ఆ పిల్లవాడు లోపలికి గంతేశాడు.

హఠాత్తుగా వాడు వెంకట్రావును చూచి—చూచీ చూడటంతోటే "ఏం కావాలి సార్? టీ. కాఫీ...." అని ప్రశ్నిస్తూ దగ్గరకొచ్చాడు వెంకట్రావుకు వాడి బూర బుగ్గలూ, ఉత్సాహం చూచేసరికి మనస్సు పాలకడలైపోయింది. అతను కాలర్ దులుపుకుంటూ వాడివంక ఒక్కసారి ప్రక్కచూపు చూచి, "కాఫీ పట్టుకరా!" అన్నాడు

ప్రొప్రయిటర్ డబ్బు లెఖ్ఖలో నిమగ్నమై అణా కానులు అణాల డబ్బీలో, బేడ కానులు బేడల డబ్బీలో వేస్తున్నాడు.

కుర్రాడు కాఫీ పట్టుకొచ్చాడు

వెంకట్రావు "నీవు పత్రికలు అమ్ముతావా?" అన్నాడు.

కుర్రాడు "మా రంగనాథంగారి పత్రికే "జలజ" ఇక్కడ అమ్ముతాం సార్. కథలు బాగా ఉంటాయి" అన్నాడు

వెంకట్రావు పత్రికను తెప్పించుకొని ఆమూలాగ్రం చూస్తూ రాత్రి తొమ్మిదింటిదాకా గడిపాడు. దానివైనం చూస్తే పరిశోధక కథల పత్రికనీ, నెలనెలా వస్తున్నదనీ, కార్యాలయం ఈ హొటల్ పై అంతస్తులోనే వుందనీ తేల్చుకున్నాడు.

మర్నాటి రాత్రి తొమ్మిది కొట్టేసరికి వెంకట్రావు ఆ పత్రికలో సహాయ సంపాదకుడైనాడు బుద్ధు అతనికి కాఫీ, కాయితాలూ, అందిస్తున్నాడు.

వెంకట్రావుకు ఎట్లా ఉద్యోగం వచ్చింది, నిరుద్యోగ సమస్య ఇంత భీకరంగా ఉంటే? అని మీరడుగవచ్చు. ఎట్లా ఉద్యోగం వస్తుందో వెంకట్రావు చెప్పలేదు పత్రిక గది ప్రక్కనే యజమాని శయ్యాగృహం ఉంటుంది. దానికి ప్రక్కగా అతిథి అభ్యాగతులకు ఒక గది వుంది; వచ్చిపొయ్యే రచయితలతో శ్రీ రంగనాథం అక్కడే మాట్లాడి పంపిస్తుంటాడు వెంకట్రావు కూర్చున్న బల్లకు ప్రక్కనే తలుపులు లేని వాకిలి ఒకటుంది. డోర్ కర్టెన్ వెయ్యకపోతే మెట్లకు ఎదురుగ్గా వున్న అద్దంలోంచి పైకి ఎవరు వస్తున్నారో, పోతున్నారో అంతా కనిపెట్టుతుండొచ్చు, ప్రక్కచూపుచూచి.

ఈ రోజు రెండు మూడుసార్లు అద్దంలో సాయంత్రం ఒక చక్కటి నర్సు, కను ముక్కుతీరు ఇట్లాంటిదని వర్ణించలేనంత సుందరి, తెల్లటి గౌను వేసుకొని మెళ్ళో వొంటివరుస గొలుసుతో నిగనిగలాడుతూ, అందాలు వొలుకపోస్తూ మెరుపుతీగలా మిలమిలలాడి, మళ్ళీ కనుపించకుండా మెట్లు దిగిపోవడం వెంకట్రావు చూచాడు! బుద్ధూని మాటమాటలో కదిపిచూస్తే-ఆమె యజమాని భార్య అని తెలుసుకోగలిగాడు వెంకట్రావు ఆమె ఈ పత్రికలో వచ్చే చిత్రాలూ, ఫోటోలు సమకూర్చి పెడుతుందట.

రంగనాథం మాతృభాష ఏమిటోగాని, అతను అన్ని తెలుగు పత్రికలు చూచి, ఈ పంచవర్ణ చిత్రాంచిత పరిశోధక మాసపత్రికను పెట్టి దిగ్విజయంగా నడుపుతున్నాడని తెలుసుకున్నాడు వెంకట్రావు. మనిషి నిండుకుండలా తొణకకుండా సాదరంగా మాట్లాడే స్వభావం కలవాడు. ఆ రాత్రంతా అక్కడే కూర్చుని "అద్దంలో ఆసుపత్రి" అన్న కథ రాశాడు వెంకట్రావు పెద్ద ఆసుపత్రిలో చక్కగా ఫినాయిల్ వాసన వొస్తుంటుంది, ఒక గదిలో కార్ యాక్సిడెంట్‌లో దెబ్బతినివచ్చిన పేషెంటును కట్లుగట్టి తెచ్చి పడుకోబెడతారు; డాక్టర్లు చూచిపోయిన తర్వాత, వారి బూట్లు గరగర నర్దు మణిగిన తరవాత-రోజాపువ్వు లాంటి నర్సు వచ్చి, అతని టెంపరేచర్ చూస్తుంటుంది రోగి హాయిగా వుందని చిరునవ్వు నవ్వుతుంటాడు.

"గాయం త్వరలో మానుతుంది లెండి భయపడకండి" అంటుంటే దెబ్బతగిలిన రోగి రోజాపువ్వు-రోజాలాంటి గాయంలెండి అంటూ చిరునవ్వు నవ్వుతాడు

రోజాపువ్వు-ఆ పచ్చటి చెట్టుమీద వున్నప్పుడు. ముండ్ల పొత్తిళ్లలో వున్నా-ఘాటైన వాసనను విరజిమ్ముతుంటుంది ఆ ఘాటు-అదో రకంగా వుంటుంది. దాని రేకులు అమాయకంగా వుంటాయే కాని, చెట్టుమీద వున్నప్పుడు ఒకరకంగా కనుపిస్తాయి త్రుంచి చేతిలో పెట్టుకున్నప్పుడు ఒక్కొక్కరికి ఒక

రకంగా వాటి ముఖం చూపిస్తాయి. వెన్నెట్లో తెల్లటి చారలతో, ఊదారంగు ఎరుపుచొక్కా వేసుకున్నట్టు కనుపిస్తాయి. వాటి రక్తం కాదు, రక్తిమ ఎప్పుడూ ఎర్రగా ఉండదు; పేలి పాలి వాలి రకరకాలుగా ఆ పువ్వు ఆకర్షిస్తుంది. దానిలో ఆకర్షణ వున్నదేకాని, హాయిలేదు. ఆ ఘాటువాసన అంతగా గరళకంఠుడు కూడా భయపెట్టడు

రోజాపువ్వు - రోజాపువ్వులాంటి గాయమే. అంటూ అట్లా ఎందుకు రాశాను? అని ప్రశ్నించుకుంటూ వెంకట్రావు చరచరా మెట్లు దిగిపోయాడు!

వెంకట్రావు మెట్లు దిగుతుండడం-బుద్ధూ చూచాడేకాని - "ఎక్కడి" కని అడగలేదు. వెంకట్రావు రాస్తున్న కథ పూర్తికాలేదు. ★

(ఇంకా ఉంది)

# చలికాలపు ఉదయం

మూలం: ఎ. ఎస్. పుష్కిన్ అనుకృతి: శ్రీ శ్రీ

హేమంతం సూర్యకాంతి! ఎంత మంచి దివసం!
ఇంకా నిద్రపోతావేం? ఇది చక్కని ఉదయం!
సఖీ! సుభగముఖీ, చాలు సిగ్గులేని మగత
అవలింత మాను, నిదురకనుల తెరువు సుంత!
ఉత్తర దిగ్గగనం పయి చుక్కలాగ వెలుగుమా!
ఉత్తర దిక్ప్రభాతశిఖ నెదుర్కొనుము ప్రియతమా!
నిన్నరాత్రి (నీకు తెలుసు) సుడిగాలుల కేకలో
పొగమంచుల పొరలుక్రమ్మ ఆకాశపు రేకుల్లో
పచ్చని ఒక మచ్చలాగ చందమామ చల్లగా
భయపెట్టే మబ్బుల్లో ప్రయాణించె మెల్లగా
పరితాపపు ప్రతిమలాగ ప్రాణసఖీ నీవు
కూర్చున్నావపుడు, ఇపుడో? కిటికీ తెరిచి చూడు.
నీలినీలి నింగికింద రంగు తివాసీ వలెనే
నీరెండలలో మిలమిలలాడి సొగసులాడి మంచు
నిద్రిస్తున్నది: నల్లని వస్తువన్నదే లేదు
చెట్లు మాత్రమే నల్లగ కాస్తకాస్త కనిపించును,
పొగమంచుల మడతలలో ఆకుపచ్చ సరుగుచెట్లు
అల్లవిగో! మంచుకింద నది కంటున్నది కలలు
ప్రాణసఖీ గుర్రాన్ని బండినీ పిలిపిస్తే
మరీ మంచిదనుకుంటా ప్రయాణానికిదే అదను.
పదపోదాం ప్రణయినీ ఉషఃకాల హిమానీ మృదు
పథాలలో నీవు నేను, గుర్రపు డెక్కల చప్పుడు
వింటూ, బండీ గంటలువింటూ పోదాం పదపద.
ఎవరులేని ఎవరురాని పొలాలలో తిరుగుదాం
ఆకురాలి శూన్యమైన అరణ్యాల కరుగుదాం
నాకెంతో సుఖమిచ్చే నదివొడుకు కదలుదాం.

—("సోవియట్ భూమి" నుండి.)

# చతురస్రం

సీరియల్ కథ

## ( 3 )

(రచన బెల్లంకొండ రామదాసు)

ఇలా జరుగుతుందని ఎవరూ అనుకోరు కాని సరిగ్గా అలాగే జరిగింది ఒక గుర్రం ఒక మనిషి జీవితాన్ని మార్చడం చాలా విచిత్ర మైన విషయమే ఆ గుర్రం పేరు జాన్ జాన్ చాలా చరిత్రగలది తనేకాక తన తండ్రి తాతలు కూడా మెరుపల్లే పరుగెత్తేవారు ఎందరి నుదుటి గీతలో వాటి పరుగులకు మారి పోయాయి వెంకట్రావు గీత "జాన్" పరుగుతో మారింది

పది సంవత్సరాలనుంచి పట్టుమని పది రూపాయల మొహం చూడని వెంకట్రావు పది నిమిషాల్లో పది లక్షలకు అధికారికావడం లోకానికి ఆశ్చర్యం కలిగించినా అతనికి మాత్రం ఆశ్చర్యం కలిగించలేదు 'కష్టాలు ఎలా వస్తాయో సుఖాలూ అలాగే వస్తాయి మన చేతుల్లో ఏముంది?' అని ఊరుకున్నాడు గంభీరంగా

అన్ని పేపర్లలో తన పేరు పడినప్పుడు, అందరూ తనను కంగ్రాచ్యులేట్ చెయ్యాలని వచ్చినప్పుడు, పాత స్నేహితులు కొత్తప్లానలతో తయారైనప్పుడు, సలహాలతో సరసాలతో మనుష్యులందరూ తనచుట్టూ మూగినప్పుడు చిరునవ్వునవ్వి మాత్రం ఊరుకున్నాడు 'వీళ్లు ఇప్పుడూ నన్ను వదిలేట్టులేరు పూర్వం ఒక రకంగా వేటాడారు. ఇప్పుడు మరో రకంగా వేటాడుతున్నారు' అనుకుని ఊరుకున్నాడు. డిన్నర్ పూర్తి చేయించి అందరినీ కరస్పర్శలతో సాగనంపేసరికి ఇంచుమించు అర్థరాత్రి కావచ్చింది చిట్టచివరి కరస్పర్శ వెంకట్రావుకు మృదువుగా సోకింది రెండు సోగకళ్లు అతని వంక తదేకంగా చూచి ఒక మెల్లని స్వరం, "మీరు నన్ను గుర్తించి ఉండరు" అన్నది "కావచ్చు నేను గుర్తించని విషయాలు ఎన్నో ఉన్నాయి" అన్నాడు వెంకట్రావు ఈ మాటకు ఆమె చిరుపెదవి సన్నగా వణికింది కనుజీర కొంచెం ఎరుపెక్కింది

"మీతో మాట్లాడాలి. ఇలా దయచేస్తారా?" అంటూ మెల్లగావెళ్ళి సోఫాలో కూచుంది

"చాలా రాత్రయింది ఇంక విశ్రాంతి తీసుకుంటే మంచిదనుకుంటాను," అన్నాడు వెంకట్రావు మరోవైపుచూస్తూ

"విశ్రాంతి చనిపోయిన వాళ్ళకే" అన్నదామె ఈ మాట వెంట్రావుమీద పిడుగల్లే పడింది మెరపులా వెనక్కు తిరిగి ఒకక్షణం ఆమెను తీక్షణంగా పరిశీలించి "ఇక మీరు వెళ్ళొచ్చు" అని మేడ మెట్లెక్కబోయాడు. ఆమె లేచి వెళ్ళబోతూ ద్వారంవద్ద నిల్చుని "వెళ్ళడానికి నా కభ్యంతరం లేదు. కాని. .." అని చరచరా వెళ్ళిపోయింది వెంకట్రావు 'ఉండండి' అనబోయాడు కాని నిభాయించుకుని మేడ మెట్లెక్కి పడకగదిలోకి వెళ్ళిపోయాడు

ఎదురుగా నిలువుటద్దం వేలాడుతున్నది ఎన్నాళ్లైందో వెంకట్రావు అద్దంలో చూచుకుని! నిశ్చలంగా నిల్చుని అద్దంలో తన ముఖాన్ని చూచుకున్నాడు కళ్ళల్లో అప్పుడే నీడ లేర్పడ్డాయి జుట్టు కొద్దిగా నెరిసింది. ముఖంలో

ముసలితనం మురిఊడలు దింపుతోంది వెంకట్రావుకు భయం కలిగింది. తను చూస్తున్నది తన స్వంత ప్రతిబింబమైనా, అది తనపై జాలిపడుతున్న ఎవరో పిత్రుదేవత పిశాచరూపంలా ఉన్నది. "విశ్రాంతి చనిపోయిన వాళ్ళకే" అని ఆమె అన్న మాటలు ఆతని చెవుల్లో మారుమ్రోగాయి. ఆ క్షణంలో వెంకట్రావుకు నిజంగా ఈ సృష్టి అంతా ఒక అర్థంలేని కలలా అనిపించింది. "మనిషి ఒక క్షణం జీవిస్తాడు ఈ క్షణిక జీవితంలో ఎన్నో గొడవలు" అనుకున్నాడు వెంకట్రావు

కాని ఈ వేదాంతం అతన్ని సన్యాసిని చెయ్యడానికి మారుగా జీవితాన్ని ఆనందమయంగా ధ్వంసం చేసుకునే ఒక నిర్లిప్తుణ్ణిగా చేసింది. ఆ రాత్రి వెంకట్రావుకు ఒక భయంకరమైన కల వచ్చింది ఈ ప్రపంచం ఒక పెద్ద కోనేరు ఆ కోనేట్లో స్త్రీ పురుషులు, నగ్నంగా జలక్రీడ లాడుతున్నారు

వెంకట్రావు నిద్ర లేచేసరికి బాగా ప్రొద్దెక్కింది పక్కమీద అలాగే ఆలోచిస్తూ పడుకున్నాడు మళ్ళీ 'ఆమె' జ్ఞాపకం వచ్చింది ఆమెను చూడాలనిపించింది ఆమె ఎడ్రస్ కూడా తీసుకోలేదు నీడలావచ్చి నీడలావెళ్ళిన ఆమె ఎవరైఉంటుంది? వెంకట్రావు ఒత్తిగిలి ఒక సిగరెట్ కాల్చుకుని, 'నా జీవితంలో ఎన్నో నీడలు ప్రవేశించాయి ఎన్నో నిష్క్రమించాయి ఇదీ ఒకటి' అని ఊరడించుకున్నాడు

సాయంత్రం క్లబ్ తోటలో ఒంటిగా కూచున్నాడు వెంకట్రావు 'ఒక గేమ్ హెల్ప్ చేస్తారా?' అని విసురుగా పింగ్‌పాంగ్ టేబిల్ వద్దకు వెళ్ళిందామె వెంకట్రావు బాట్ తీసుకోగానే "మీకు గేమ్ అలవాటేనా?" అన్నది "అలవాటే కాని మీతో ఆడడం అలవాటు లేద"న్నాడు వెంకట్రావు "అయితే అలవాటు చేసి ఓడిస్తాలెండి" అని బంతి విసిరింది వెంకట్రావు బంతి చేతిలో పట్టుకుని వెళ్ళి కూచున్నాడు ఆమె నిరాశతో అతన్ని సమీపించి, "అప్పుడే ఆట ముగించారేం?" అన్నది వెంకట్రావు వెళ్ళి కారులో కూచున్నాడు ఆమె కూడా వెళ్ళి వెంకట్రావు పక్కనే కూచుంది

"మీ రెంతవరకు?" అన్నాడు వెంకట్రావు "మీ రెంతవరకు?" అన్నదామె.

బీచ్‌లో కారు ఆగడంతోటే, "ఇక్కడ ఆపారేం?" అన్నది వెంకట్రావు మౌనంగా సిగరెట్ కాలుస్తూ కూచున్నాడు. "ఈ బీచ్ అందంగా ఉంటుంది ఇక్కడికి ఎవరూరారు" అన్నది వెంకట్రావు హఠాత్తుగా ఆమెవంక తిరిగి "నీపేరు పద్మ కదూ?" అన్నాడు ఆమె కొంచెం కలవరపడి, "నాపేరెలాకనిపెట్టారు?" అన్నది "నిన్ను చూడగానే అదే నీపేరై ఉంటుందనుకున్నాను" అన్నాడు. "మంచి జ్యోతిష్యులే" అని శిరస్సు అతని బుజంమీద వాల్చింది వెంకట్రావు మెల్లగా పక్కకు ఒరిగాడు ఆమె "ఏం? నాతల బరువుగా ఉన్నదా?" అన్నది వెంకట్రావు ఒకక్షణం మౌనంగా ఊరుకుని, "మీరిక దిగి వెళ్ళండి" అన్నాడు ఆమె, "ఒంటరిగా ఇంటికి వెళ్లలేను, మీరు తోడురారూ?" అన్నది "ఇంట్లో ఎవరూ లేరా?" అన్నాడు వెంకట్రావు. "ఎందుకు లేరు పిల్లలున్నారు. నా భర్తగారున్నారు కాని అందరూ నిద్రపోతుంటారు. నా కొక్కదానికీ ఎంతోచదు" అన్న దామె వెంకట్రావు చిరునవ్వు నవ్వి "పద్మా! నిన్ను ఈ సముద్రం ఒడ్డుకు ఎందుకు డ్రైవ్‌చేశానో తెలుసా?" అన్నాడు ఆమె తెలుసన్నది "తెలీద"న్నాడు వెంకట్రావు "నాకు, తెలీకపోతే మీకు తెలిసిందేదో చెప్పండి" అన్నదామె

ఒకక్షణం ఆగి, "ఏం లేదు. నిన్ను మర్డర్ చేసి ఈ సముద్రంలో తోసెయ్యాలని" అన్నాడు వెంకట్రావు ఆమె రివ్వున కారుదిగి వెళ్ళి ఇసుకలో కూచుంది వెంకట్రావు పిలవలేదు అతను పిలుస్తాడని రెండుమూడుసార్లు వెనుదిరిగి చూచింది కాని అతను శిలలా సిగరెట్‌కాలుస్తూ కారులో కూచుని ఉన్నాడు ఆమె మళ్ళీ తిరిగి చూచేసరికి అతను కారు డ్రైవ్‌చేసుకుని వెళ్ళిపోయాడు

ఆ రాత్రి అతను ఇంటికి వెళ్ళలేదు రాత్రి పదకొండుదాటినా ఒక నైట్‌క్లబ్ సాగుతోంది. ఆ క్లబ్‌లో ప్రవేశించాడు. వెంకట్రావు 'డ్రింక్' ఆర్డర్‌చేసి కూచోగానే "సిగరెట్ ప్లీజ్" అని

ఒక సన్ననిగొంతు అతన్ని మేల్కొల్పింది ఎదురుగా కూచున్న హెలెన్ అతన్ని చూచి మెల్లగా నవ్వింది ఆమెకొక సిగరెట్టందించి తనొక సిగరెట్ ముట్టించుకున్నాడు పొగ రింగుల్లోంచి ఆమెముఖాన్ని చూశాడు ఆమె ముఖం అదోవిధంగా ఉంది. చెక్కిలిమీద ఒక చిన్నమచ్చ చిరుమబ్బులా మిలమిలా మెరుస్తోంది కళ్ళు బరువుగా దించుకుని ఉన్నాయి వెంకట్రావును ప్రధానంగా ఆకర్షించింది ఆ మచ్చ

మరునటిరోజు మధ్యాహ్నంకాని ఇంటికి చేరలేదు వెంకట్రావు చిరాకులో పనిమనిషి మీద ధుమధుమలాడి అర్థకూడుతిని వెళ్ళి పడుకున్నాడు ఆ నిద్రనిద్ర మరునటిరోజు మధ్యాహ్నంకాని మేలుకోలేదు లేవగానే స్నానంచేసి మళ్ళీ ఆ క్లబ్‌కు వెళ్ళాడు హెలెన్ షాంపూ చేసుకొని తలార్చుకుంటోంది

వెంకట్రావును చూడగానే "హలో డార్లింగ్" అని ఆప్యాయంగా పలకరించింది వెంకట్రావు బద్ధకంగా సోఫాలో కూచుని, "హెలెన్ నీదగ్గర ఒక వస్తువుంది నా కిచ్చేస్తావా?" అన్నాడు

"మీ రడిగింది ఎన్నడైనా ఇవ్వనన్నానా?" అన్నది హెలెన్

"అయితే ఇచ్చెయ్" అని ఆమె వెనక్కు వెళ్ళి నిల్చున్నాడు. అద్దంలో వెంకట్రావు పావను సుదీర్ఘంగాచూచి, "ఏమిటో చెప్పండి" అన్నది. "ఇదుగో, ఈ మచ్చ ఏమైనా ఇస్తాను ఇది నా కివ్వు" అని ఆమెను చేతుల్లోకి తీసుకుని "నీ ముఖం నిర్మలమైన ఆకాశంలావుంది ఈ మచ్చ చక్కని చిరుమబ్బులా ఉంది." అన్నాడు హెలెన్ సిగ్గుతో చిరునవ్వు నవ్వి, "డార్లింగ్, ఇదే నేను ఇంత కాలం శ్రమించి నిలవచేసుకున్న ఆస్తి ఇది ఇచ్చేస్తే ఇంకేముంది చెప్పు" అన్నది. వెంకట్రావు కళ్లు ఒక్క క్షణం నీళ్ళతో మెరిశాయి హెలెన్ కర్చీఫ్‌తో అతని కళ్ళు తుడిచి, "డియర్ నీది వట్టి పేదగుండె" అన్నది. వెంకట్రావు కాసేపు మౌనంగా కూచుని, "హెలెన్, మనం వివాహం చేసుకుందామా?" అన్నాడు. హెలెన్ సన్నగా నవ్వి, "వివాహం చేసుకుని ఏంచేస్తారు?" అన్నది "మనల్ని స్మరించేవాళ్ళు మన అనంతరం ఉండొద్దా?" అన్నాడు వెంకట్రావు హెలెన్, 'వివాహం కొందరికి రిజర్వ్ సీటు మనలాటి వాళ్లు వివాహం చేసుకున్నా మరుక్షణాన విడిపోతారు,' అని మెల్లగా వచ్చి అతని పక్కన కూచుని ఒక సిగరెట్ ముట్టించుకుంది వెంకట్రావు ఆమె నోట్లో సిగరెట్ లాగేసి "ఛీ, సిగరెట్ కాలిస్తే నా కసహ్యం" అన్నాడు

"ఎన్నాళ్లనుంచి?" అన్నది హెలెన్ "ఎప్పుడూ" అని లేచి వెళ్ళబోయాడు ద్వారం దగ్గర అతని చేతులు పట్టుకుని, "ఇంత త్వరగా వెడతారా?" అన్నది వెంకట్రావు చేతులు విదిలించుకుని వెళ్ళిపోయాడు

ఆ రోజంతా అతనికి నిద్రపట్టలేదు రివాల్వింగ్ ఫౌంటెన్ ఒడ్డున కూచుని చిరుచేపలను పరిశీలిస్తూ గడిపాడు క్లబ్‌కు కూడా వెళ్లలేదు చేపలు కాసేపు నిద్రిస్తున్నట్టుంటాయి కాసేపు నీళ్లను అల్లకల్లోలం చేస్తాయి, వెంకట్రావు ఈ విచిత్రం చూస్తూ కూర్చున్నాడు వెంకట్రావు ఎంతకూ రాకపోగా విసుగెత్తి వంటవాడు తనే వచ్చి, "బాబుగారూ అన్నం వడ్డించనా?" అన్నాడు వెంకట్రావు అలాగే తల వంచుకుని "నీవు తినెయ్, నేను అన్నం మానేశాను" అన్నాడు వాడు గాభరాతో వెళ్ళిపోయాడు

వెంకట్రావు పండుకునేసరికి రాత్రి ఒంటిగంట దాటింది నైట్‌క్వీన్ మత్తెక్కిస్తోంది. కాలం నిలిచిపోయినట్టుగా ఉంది అప్పుడు వెంకట్రావు తన్ను తనే పిలిచి, "హలో మిస్టర్ వెంకట్రావు, సుఖంగానే ఉన్నావా?" అని అడిగాడు. రెండో వెంకట్రావు కాసేపు ఆలోచించి, "సుఖంగానే ఉన్నాను కాని సుఖంగా లేను" అన్నాడు ఎన్నో ప్రశ్నలూ, ఎన్నో సమాధానాలూ ఎరుగును వెంకట్రావు కాని ఈ ప్రశ్నకు సమాధానం అతనికి తెలీలేదు. వెంటనే లేచి ఆ సమాధానానికి అర్థం ఆలోచిస్తూ కూచున్నాడు ఈ ఆలోచనతో రోజులూ, నెలలూ గడిచాయి రోజూ ఒకే ఉదయం, ఒకే అస్తమయం

ఒక రాత్రి వెంకట్రావు క్లబ్‌నుంచి బైటపడేసరికి ఒంటిగంట దాటింది, రాత్రి గడ్డ

కట్టినట్టుంది ఎలక్ట్రిక్ లైట్ కింద ఒక కుక్క ఒంటరిగా పడుకుని నిద్రిస్తోంది అర్థంలేని జీవితంలా నల్లని తారురోడ్డు సాగిపోతోంది వెంకట్రావు బరువుగా కాళ్ళీడ్చుకుంటూ నడక సాగించాడు గాడీయమఠంలో ఒక బైరాగి మెల్లని గొంతుతో మీరా కీర్తన పాడుతున్నాడు. వెంకట్రావు ఒక క్షణం నిల్చుని ఆ కీర్తన విని నడక సాగించాడు "ఆ మఠంలో చేరిపోతే" అనుకున్నాడు "హాయిగా ఉంటుంది అన్ని సమస్యలూ శమిస్తాయి" అనుకున్నాడు. ఇంకా ఆ బైరాగి గొంతు దూరంనుంచి వినిపిస్తూనే ఉంది. మఠంలోకి వెళ్ళాలని వెనక్కు తిరిగాడు. "రండి, రండి భయంలేదు' అని ఒక స్త్రీ గొంతు వినిపించింది తిరిగి చూస్తే ఒక స్త్రీ వాకిట్లో నిల్చుని ఉంది

వెంకట్రావు పందిరి మంచంమీద కూర్చున్న తరువాత కూడా ఆ బైరాగి కీర్తన వినిపిస్తూనే ఉంది వెంకట్రావు పరధ్యానంగా "నిద్ర వస్తోంది నిద్రపోతాను" అని కళ్లు మూసుకున్నాడు "కొంచెం కాఫీ తీసుకోండి" అని ప్లాస్క్‌లో కాఫీ తెచ్చి పక్కనే కూచుని "ఇంత రాత్రి ఒంటిగా ఇంటికేం పోతారు" అన్నది వెంకట్రావు, "నీ పేరు?" అన్నాడు "పద్మ" అన్నదామె వెంకట్రావు చివాలున లేచి "మళ్ళీ దెయ్యాల కొంపకు చేరానా" అని వెళ్ళిపోయాడు ఇంటికి చేరేసరికి రెండు గంటలు దాటింది అందరూ నిద్రిస్తున్నారు. చిన్న గేటు మాత్రం తెరిచి ఉంచారు బరువుగా మెట్లెక్కి పడకగది చేరి లైట్ వెయ్యగానే అద్దంలో పాప కనుపించింది కళ్లు నీళ్ళులేని నూతుల్లా ఉన్నాయి నుదుటిమీద నగంవరకు ఒక మచ్చ వ్యాపించింది చెక్కిళ్ళు లోతుగా పీక్కుపోయాయి ఒళ్లు జ్వరంతో కాలిపోతోంది. మళ్ళీ అతని చెవుల్లో 'చనిపోయిన వాళ్ళకే విశ్రాంతి' అన్న మాట మారుమ్రోగింది.

ఉదయాన్నే సేవకుడు గోవింద్ వెంకట్రావు వైఖరి చూచి ఆశ్చర్యపోయాడు 'బాబుగారు, కొన్నాళ్లు విశ్రాంతి తీసుకోండి" అన్నాడు. వెంకట్రావు ఈ మాటల్లోని అర్థాన్ని గ్రహించక పోలేదు "చనిపోయిన వాళ్ళకే విశ్రాంతి" అన్నాడు మెల్లగా. కాసేపాగి గోవింద్, "బాబుగారూ, వివాహం చేసుకోరాదా?" అన్నాడు వెంకట్రావు మెల్లగా నవ్వి, "ముసలాణ్ణి నాకు పెళ్ళెందుకురా?" అన్నాడు వెంటనే, "గోవింద్, నీవే దేశాలు చూచావురా?" అన్నాడు.

"చాలా దేశాలు చూచానయ్యా" అన్నాడు గోవింద్

"ఏ దేశం బావుంటుందిరా?" అన్నాడు వెంకట్రావు "అన్ని దేశాలూ ఒకలానే ఉంటాయి అంతా మనలో ఉంటుంది" అన్నాడు గోవింద్ వెంకట్రావు మరి మాట్లాడ లేదు ఆ రోజంతా ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లోనే గడిపాడు పడక గదిలోకి వెళ్ళాడు కాని అద్దం మాత్రం చూచుకోలేదు.

మరునటి రోజు ఉదయం లేచి స్నానంచేసి డ్రెస్ చేసుకున్న తరువాత ఎంచాతనో హెలెన్‌ను చూడాలనిపించింది ఆ రోజు నిజంగా తనదే తప్పు. సిగరెట్ కోసం పోట్లాడి వచ్చేశాడు వెంటనే కారు హెలెన్ ఇంటికి డ్రైవ్ చేసుకుని వెళ్ళాడు

హెలెన్ ఇంట్లో ప్రవేశించగానే ఒక ముసలావిడ కూచుని ఉంది. "ఎవరు కావాలి?" అన్నది "హెలెన్" అన్నాడు వెంకట్రావు ముక్తసరిగా "హెలెన్ లేదు, టెరెసా ఉంది," అన్నది ముసలావిడ. ఈ జవాబుకు వెంకట్రావు మండిపడి "హెలెన్ ఎక్కడుందో చెప్పు?" అన్నాడు గట్టిగా. "ఎక్కడుంది? స్వర్గంలో ఉంది" అన్నది ముసలావిడ మెల్లగా. వెంకట్రావుకు ఏమనాలో తెలీలేదు. "ఏమిటి నీవంటున్నది?" అన్నాడు ఆందోళనతో. "హెలెన్ చనిపోయింది ఆత్మహత్య చేసుకుంది కారణం తెలీదు" అన్నది ముసలావిడ వెంకట్రావు అక్కడే కూలబడిపోయాడు

ఆ మరునటిరోజు మళ్ళీ అద్దంలో పాప చూచుకున్నాడు. నుదుటి నిండా మచ్చ వ్యాపించింది. కళ్లు నెత్తుటి కొలనుల్లా ఉన్నాయి. కొంచెం దగ్గుకూడా ప్రారంభించింది ఆ సాయంత్రం గోవిందుణ్ణి పిలిచి, "గోవింద్, బట్టలు సర్దు, అలా దేశంచూచి

వస్తాను' అన్నాడు గోవింద్ కొంచెం చకితుడై, "బాబుగారూ, ఈ పరిస్థితిలో ప్రయాణం చేస్తారా? నేనూ వస్తాను" అన్నాడు.

"గోవింద్, నీవిక్కడే ఉండు, నేనంటే బ్రహ్మచారిని ఎక్కడ తిరిగినా పరవాలేదు అలా వెళ్ళి కాశీ, ప్రయాగ, బదరీనాథ్, కలకత్తా అవీ చూచి వస్తాను," అని వాడిచేతుల్లో ఒక వెయ్యి రూపాయల నోట్లకట్ట పెట్టి కాశీకి బెర్త్ రిజర్వ్ చేయించుకుని వెళ్ళిపోయాడు

## ( 4 )

## (రచన నెల్లూరి కేశవస్వామి)

కథానాయకుడు వెంకట్రావు హఠాత్తుగా నిద్ర మేల్కొన్నాడు ఎవరో కొరడా పుచ్చుకుని కొట్టినట్టు ఉలిక్కిపడి లేచి కూచున్నాడు అబ్బ! ఎంత దీర్ఘనిద్ర! కాని ఇదేమిటి? గదేదీ? తగిన ఆచ్ఛాదన సామగ్రేదీ? అంతా చీకటి! అంతా అయోమయం!

"Accident!..Accident!!" ఎవరో చీకట్లో తన సమీపంలోనే అరుస్తున్నారు తక్షణం తేరుకున్నాడు వెంకట్రావు తాను పడుకుంది తన పాత గదిలో కాదనీ, రైలు కంపార్టుమెంటులోననీ స్ఫురణకు రాగానే దిగ్గున లేచి స్విచ్ వేశాడు తన ప్రక్క బర్తుపైన పడుకున్నాయన పెట్టె మధ్యలో నిలబడి కళ్లు పెద్దవి చేసుకుని బెదురుబెదురుగా చూస్తూ గజగజ వణికిపోతున్నాడు. అతని పెదాలు ఇంకా "accident, accident" అనే శబ్దంలేని పదాల్ని ఉచ్చరిస్తోనే వున్నాయి ఇంతలోకి అరుపులూ, ఏడ్పులూ, బొబ్బలూ, కేకలూ వినిపించటం మొదలెట్టాయి.

వెంకట్రావుకు అర్థమౌతోంది నెమ్మదిగా వెళ్ళి తలుపులు తెరిచి చూచాడు అంతా కారుచీకటి కొద్ది క్షణాలకిగాని నక్షత్రాల వెలుగులో ఏం జరిగిందో చూడగలగలేదు రైలు బండి ఒక ఎత్తైన కట్టపైన నిలబడి వుంది కాని తన కంపార్టుమెంటువున్న డబ్బాముందు అంతా శూన్యం. ఇంజనులేదు, డబ్బాలూ లేవు కట్టకిందికి దొర్లిపోయినట్టున్నాయి అక్కడినించే అరుపులూ, బొబ్బలూ వినిపిస్తున్నాయి తక్కిన డబ్బాల్లోంచి ప్రయాణీకులు దిగి పరుగెత్తుతున్నారు

వెంకట్రావు వెనక్కు తిరిగి "అవును యాక్సిడెంటే" అని తిరిగి బర్తుపైన కూచున్నాడు కిందో మనిషి వెంకట్రావుకేసి వింతగా చూస్తూ గబగబా బండిదిగి చీకట్లోకి మాయమైపోయాడు కాసేపు అలానే మౌనంగా కూచుని వెంకట్రావుకూడా అతణ్ణి అనుసరించాడు

అంతా చీకటిమయంగా ఉంది చీకటిని చీల్చుకుని వచ్చే కేకలూ, బొబ్బలూ, మనుషుల అలజడీ వినపట్టం తప్ప మరింకేమీ గోచరించటంలేదు ఆ ప్రదేశం ఎక్కడో ఏవిఁటో కూడా అర్థంకావటం లేదు చెట్లూ గుట్టలులేని బయలు ప్రదేశంగా మాత్రం తోస్తోంది

కట్టదిగి వెంకట్రావు అందరితోబాటు అరుపులు వినిపించే వేపుకు నడిచాడు

"ఆ పడిపోయిన డబ్బాలు ఆడవాళ్ళవిటండీ ." వెంకట్రావు ప్రక్కనే ఎవరో అంటున్నారు.

"అయ్యో! పాపం ఆడవాళ్ళూ, పిల్లలూ!"

వెంకట్రావు నడుస్తున్నవాడల్లా చప్పున ఆగిపోయాడు కుడివేపుకు మళ్ళి, కొద్ది దూరాన వున్న ఒక ఎత్తైన ప్రదేశాన చతికిలబడ్డాడు సిగరెట్ వెలిగించాడు

అవును, తానెందుకెళ్ళాలక్కడికి? తనకేం పని? వెళ్ళినా తానేం జేయగలడు? ఏ స్త్రీయో కాళ్లువిరిగి బాధపడుతోంటే, ఏ పసిపాపో తల బ్రద్దలై పడివుంటే, ఏ చచ్చిపోయి పడివున్న తల్లి శవంపైనో పడి పిల్లలు "అమ్మా! అమ్మా!" అని ఏడుస్తూంటే, వాళ్లనిచూచి తాను చేయగలిగిందేవిఁటి, జాలిపడటం తప్ప? ఎవరి తల్లికోసమో, ఎవరి పెళ్లాం పిల్లలకోసమో తను బాధపడటందేనికి? ఉఁహూ, అల్లా బాధపడదలచుకోలేదు నిజంగా ఈ బంధుకోటి ఇంద్రజాలం ఎంత భయంకరమైంది! దాన్నించి తప్పించుకు బయటపడటానికి తాను ఎంత భగీరథ ప్రయత్నం చెయ్యాల్సి వచ్చింది! ఆనాడు బి య్యే రెండో సంవత్సరం పరీక్ష ఇవ్వకుండా వొచ్చేసినందుకు తన్ను తాను ఎంతైనా శ్లాఘించుకోవొచ్చు. తన జన్మలో అంతవరకూ

అంతకంటే మంచి తెలివైనపని మరొహటి చెయ్య లేదు నిజంగా తానే గనక ఫైనల్ పరీక్ష ఇచ్చి ప్యాసై ఉండివుంటే తనగతి ఏమైపోయేది? వంశమర్యాద నిలబెట్టడానికిగానూ, కుటుంబా నికి పేరుప్రఖ్యాతులు తేవటానిగ్గానూ ఏ గుమస్తా గిరీ ఉద్యోగంలోనో తలదూర్చాల్సి వచ్చేది వెంటనే పెళ్ళి కూర్చునేది. ఈ పాటికి రెండు సంవత్సరాలకి ఒకటిచొప్పున అరడజను పిల్ల లేనా తయారై వుందురు వాళ్ళందరికీ దాణా గింజలు సప్లయిచెయ్యలేకా, అప్పచెల్లెళ్ళకి మొగుళ్ళని వెతికి తేలేకా పంజరంలోపడ్డ చిలక లాగా గిజగిజా తన్నుకుంటుండేవాడు. తీరా ఇట్లాంటి 'ఆక్సిడెంట్'లో ఏ చెల్లెలో, పెళ్లామో పిల్లలోపడి నలిగిపోతే గుండెబాదుకు చావాల్సి వచ్చేది. అబ్బ .జంఝూటాన్ని వదలించుకో టానికి ఎంత కష్టమైంది! తాను అమాంతంగా లక్షాధికారి అయిపోయినవార్త నలుమూలలా వ్యాపించేసరికి కుటుంబీకు లంతా కాకుల్లా మూగారు! కాని తానుమాత్రం ధైర్యంగా ఆ సంఘటనని నెదుర్కొన్నాడు తన నియమానికి ఏ మాత్రం భంగం రానీకుండా, వాళ్ళకి నిక్క చ్చిగా చెప్పేశాడు "మీకూ నాకూ ఏ సంబం ధమూ లేదు ఇవిగో ఈ లక్షరూపాయలు తీసు కుని వెళ్లండి దీంతో మీకూ, నాకూ చెల్లు తిరిగి ఎవ్వరూ నా గడప తొక్కవద్దు ఎవరేనా వచ్చారా గేటునుంచే గెంటించి వేస్తాను జాగ్రత్త" అని, లక్షరూపాయలిచ్చి వాళ్ళని తరిమి వేశాడు ఆ లక్షరూపాయలూ వాళ్ళూ సరిగా అందరికీ సంతృప్తికరంగా పంచుకోలేక తమలో తాము ఎన్నో పేచీలు పడతారని, వద్దా రనీ వెంకట్రావుకు తెలుసు కాని తిరిగి ఎవ్వరూ వెంకట్రావు దగ్గరికి రా సాహసించలేదు అదే పదివేలనుకున్నాడు వెంకట్రావు. నిజంగా ఒంటరిజీవితం ఎంతోహాయి!

హాయి అనే పదం వినగానే దిగ్గున లేచి కూచున్నాడు, వెంకట్రావులోని రెండోమనిషి. "ఏవిఁటీ, ఏమన్నావ్ వెంకట్రావ్? నువ్వు హాయిగావున్నావా? నువ్వు? అవునా?" అని నిలేసి అడిగాడు వెంకట్రావు నిలువునా నీరై పోయాడు. ఏఁ సమాధానం చెబుతాడు! ఆ ప్రశ్నే తనని నీడలా నిరంతరం వెన్నాడు తోంది. ఆ ప్రశ్నకు సమాధానంకోసమే తాను ప్రపంచాన్ని గాలించి వేస్తున్నాడు మొదట తన పాతగది మొండిగోడల్లో, సందుగొందుల్లో, పూటకూళ్ళల్లో వెతికాడు ఆ తర్వాత గుర్రపు పందాల్లో, క్లబ్బుల్లో, డాన్సింగ్ హాల్లల్లో, బార్లల్లో, హెలెన్, టెరెసా కౌగిళ్ళలో వెదికాడు కాని ఎక్కడా ఆ ప్రశ్నకి సమాధానం చిక్కలా ఆఖరికి వాటన్నిటిపైనా విసుగేసి తన అన్వే షణా పరంపరలో ఇప్పుడిప్పుడే కొత్తపంథా తొక్కాడు దేశాటన ఆరంభించాడు. మరి నిజంగా తాను హాయిగా వున్నానని ఎల్లా అనగలడు?

ఎవరో చప్పన టార్చిలైటు వేశారు, వెంక ట్రావు మొహంపైకి కళ్ళకి చెయ్యి అడ్డంపెట్టి "ఎవరూ?" అని అడిగాడు చికాగ్గా

"మీరా?....ఇక్కడున్నారేఁ?"

"ఎవరూ?"

"నేనండీ. ఇందాక మీ కంపార్టుమెంటులో ప్రయాణం చెయ్యలా!"

"ఏఁ?"

'ఇక్కడ కూచున్నారేఁ?"

"ఏం చెయ్యమంటారూ?"

"అంత పెద్ద ప్రమాదం జరిగి, అవతల అంత అలజడవుతోంటే మీరు....?"

'నేనేం చెయ్యనూ?"

ఒక్క క్షణం నిదానంగా చూసి ఆ పెద్ద మనిషి "ఛీఁ....ఏం మనుషులు!" అను కుంటూ చరచరా వెళ్ళిపోయాడు

వెంకట్రావుకు కోపం రాలా, ఆశ్చర్యం వేసింది అతనికి తనపై అంత విసుగెందుకో. తానేం నేరం చేశాడనీ? ఈ ప్రమాదానికి తనే బాధ్యుడనా అతని వుద్దేశం? అల్లా జరగాలని తాను మనసులోనైనా తలచుకోలేదే, తనెల్లా బాధ్యుడవుతాడు? పోతే, ఇప్పుడు అందరితో బాటు తానూ అక్కడి కెళ్ళి ఆ బాధపడేవాళ్లని చూసి తనూ బాధపడలేదనేనా, అతని బాధ? హుఁ! ఏం ప్రపంచం! ఏంచేసినా తప్పే, ఏం చెయ్యక పోయినా తప్పే!

అయినా ఈ రోజుల్లో ప్రమాదాలు ఇంత విరివిగా ఎందుకు జరుగుతున్నాయో. దిన

పత్రికలంటేనే అసహ్యించుకునే తాను కూడా రోజుకో తాజా ప్రమాదం వార్త వినలేక వినుగెత్తి పోయేవాడు అప్పుడప్పుడు తానూ ఓ ప్రమాదంలో చిక్కుకుంటే ఎంత బావుణ్ణు. పీడా వదిలిపోయేది అనిపించేది తీరా ఇప్పుడీ ప్రమాదంతో వుండికూడా లేనట్టే అయింది ఆ మూడోతరగతి ఆడవాళ్ళ డబ్బాలు కాక తన రెండో తరగతివున్న డబ్బా పడిపోకూడదూ? పద్మ అన్నట్టు అప్పుడు తనకూ ''విశ్రాంతి'' లభించేదేమో! గోవిందు కూడా తనని విశ్రాంతి తీసికోమంటాడు ఎందుకు వాళ్ళకీ ఆదుర్దా? పద్మ పిశాచంలా ఎందుకలా తన్ను వెంటాడిందో! హెలెన్ చనిపోయింది తన కోసమేనా?

కెవ్వున రైలు కూత వినిపించింది వెనక్కి తిరిగి చూశాడు, వెంకట్రావు మరో ఇంజను మూడు డబ్బాలతో సహా పొగలు కక్కుకుంటూ వస్తోంది అది వచ్చి రావటంతోటే అందులోంచి పోలీసులూ, పోర్టర్లూ, డాక్టర్లూ, నర్సులూ దిగి ప్రమాదం జరిగిన చోటికి పరుగెత్తుకు వచ్చారు పెట్రొమాక్స్ లైట్లూ, స్ట్రెచర్లూ, ఫస్ట్ ఏడ్ బాక్సులు కూడా వచ్చాయి ఆ పెట్రొమాక్స్ దీపాల వెలుతురికీ, ఇంజన్ సర్చ్ లైట్ కీ ప్రదేశమంతా పట్టపగలుగా మారిపోయింది అప్పుడు చూశాడు వెంకట్రావు పడిపోయిన ఇంజనూ, రెండు డబ్బాలూ, విరిగి కుప్పలు తిప్పలుగా పడివున్నాయి జనమంతా చుట్టూ మూగివున్నారు అరుపులూ, అలజడీ మరీ ఎక్కువైపోయింది

ఎందుకోగాని ఆ కొత్త రైలుబండినీ, దాంతో వచ్చిన డాక్టర్లనీ, నర్సులనీ చూడగానే వెంకట్రావుకు కొంత మనసు కుదుటపడ్డట్టుగా అనిపించింది. తనపై నించి ఏదో బరువు దించేసినట్టనిపించింది మరో సిగరెట్ వెలిగించాడు

చేతి గడియారం చూసుకుంటే, రెండూ యాభై అయిదు ఇంక తెల్లవారటానికి అట్టే సమయంలేదు అనుకున్నాడు. అయినా తనకింకా తెల్లవారేదేమిటి! దిగ్గునలేచి కూచున్నాడుగా! ఆశ్చర్యం! ఎన్నాళ్ళకివాళ అలా హఠాత్తుగా నిద్రమేల్కొన్నాడు ఈ మధ్య బద్ధకానికి పూర్తిగా దాసుడైపోయాడు. గత అయిదు సంవత్సరాల్లోనూ ఒక్కరోజు కూడా అల్లా లేవలేదు, లేచే అవసరంకూడా కనిపించలేదు లేచి చేసేదేముంది గనకా! ప్చ్! జీవితం ఎంత స్తంభించిపోయింది! ఇంతకంటే ఆ పూర్వపు రోజులే బాగు ఏదో అర్థంకాని ఆశ తన్నెప్పుడూ ఆవరించి వుండేది పొద్దున్నే దిగ్గునలేచి తన ప్రియమైన ఆచ్ఛాదన సామగ్రి - ప్యాంటూ, షర్టూ-తొడిగేసుకుని, గది మధ్యస్థంగా బొటన వ్రేళ్ళపైన నిల్చొని కళ్ళజోడులో తన మొహం చూసుకుని ప్రపంచంపైకి దండయాత్రకు బయలుదేరే సమయంలో తాను పొందే ఆనందం ఇప్పుడేదీ? కళ్ళజోడులో మొహం, ముడత కుర్చీలాకాక, మందార పుష్పంలా కనిపించాలన్న తహతహ ఇప్పుడేదీ? ఇవాళ కూడా తానూ అలాగే దిగ్గున మేల్కొన్నాడు కళ్ళజోడులో మొహం చూసుకుంటే ఎల్లా కనిపించేదో? ఇంత ఘోరప్రమాదం ఎదురైనందుకు తప్పకుండా బావురుపిల్లిలా కనిపించి వుండేది కాని, ఊఁహు వెంకట్రావు మనసు వొప్పకోలా మందార పువ్వల్లే కనిపించేదని అంతర్వాణి పలికింది వెంటనే లేచివెళ్ళి కంపార్టుమెంటు మధ్యస్థంగా బొటనవ్రేళ్ళపైన నిలుచుని పరీక్ష చెయ్యాలని తీవ్రవాంఛ పుట్టుకొచ్చింది కాని తమాయించుకున్నాడు

వెంకట్రావు ఆలోచనలకి అమాంతంగా అంతరాయం కలిగింది అతని ముందర్నించే స్ట్రెచర్లపైన శవాలని, గాయపడ్డ వాళ్ళనీ ఒక్కొక్కరినే తీసికెళ్ళి, ట్రేన్‌లో ఎక్కిస్తున్నారు ఒక పండంటి ముసలావిడ కుప్పలా కూలిపోయి వుంది మరో బట్ట తల ముసలావిడ కాళ్ళు విరిగిపోయి, 'హా! హా' అంటూ కొనవూపిరి కోసం కొట్టుకుంటోంది. ఒక పదేళ్ళ పిల్ల మెడ విరిగిపోయి, జీవంలేని గుడ్లుతేలేసి ఆకాశాన నక్షత్రాలకేసి చూస్తోంది ఒక తెల్లని చీర ధరించిన యువతి తల బ్రద్దలై వళ్ళంతా రక్తపాతమైపోయి వుంది మరో స్త్రీ తలకో కట్టుతో జీవచ్ఛవంలా పడివుంది ఆమె?

ఆమెను చూడగానే మెరుపులా షాక్ తగిలింది వెంకట్రావుకు దిగ్గునలేచి ఆమెని తీసి

కెళ్తోన్న Stretcher కేసి సమీపించి తేరిపార చూశాడు గుండె దడదడ కొట్టుకుంటోంది శిరస్సు పొగలు గక్కుతోంది అవును....ఆమే ఆమే....తన ఆకాశకన్యక, అయస్కాంత వృక్షం... ఆమే సందేహంలేదు!. ..ఆ మోహన విషాదరేఖ, తన హృదయఫలకంపైన చెక్కి పోయిన విచారరేఖ, తను ఆజన్మాంతమూ మరిచిపోలేని విషాదరేఖ! నిస్సందేహంగా ఆమే. వెంకట్రావు గుండెలు వొక్కసారి ఆగి నట్టయినాయి

దిక్కులు దద్దరిల్లేట్లు "సీతా!" అంటూ పొలికేక వేశాడు స్ట్రెచర్ని మోసుకుపోయే వాళ్లు చప్పున ఆగి వెంకట్రావును వింతగా చూడటం మొదలెట్టారు వెంకట్రావు 'సీతా, సీతా' అంటూ పెద్దగా ఏడుస్తున్నాడు ఆమెలో చలనం ఏమీ కలగలేదు

ఎవరో వెనకనుంచి భుజంపైన చేయి వేశారు. వెనక్కు తిరిగిచూస్తే, ఓ డాక్టర్ "శాంతించండి. శాంతించండి. ధైర్యం తెచ్చుకోండి" అంటున్నాడు. "డాక్టర్! డాక్టర్! నా సీతని రక్షించండి .... రక్షించండి డాక్టర్' అంటూ వెంకట్రావు ఏడుస్తూ డాక్టర్ చేతులు పట్టుకున్నాడు

"ఏడవకండి ప్రయత్నం చేద్దాం! అంతా భగవంతుడి చేతిలో వుంది" అంటూ డాక్టర్ మరో వేపు వెళ్లిపోయాడు.

స్ట్రెచర్ అప్పటికే ట్రేన్ను సమీపించింది వెంకట్రావు "సీతా, సీతా" అంటూ పరుగెత్తుకెళ్లాడు అక్కడో పోలీసు ఆఫీసర్ అతణ్ణి ఆపాడు. "మీరు ఇందులో ఎక్కటానికి వీల్లేదు ఆమె మీకేం కావాలి?" అడిగాడు.

"ఆమె నాకేం కావాలా? అంతా....నా సర్వస్వం....నా జీవితం ఆమె." పిచ్చివాడిలా అంటున్నాడు వెంకట్రావు

"సరే సరే. మీరు వెళ్ళి ఆ ప్రక్క డబ్బాలో కూచోండి ఆమె నిక్కడ నర్సులు చూస్తుంటారు ఫరవాలేదు" అన్నాడా ఆఫీసర్.

ఆమెను బండి ఎక్కించివేశారు. వెంకట్రావు అక్కడే ఆ ప్రక్కనే ఏడుస్తూ నిలబడ్డాడు రైలు కదిలే సమయానికి వెళ్ళి ప్రక్కడబ్బాలో కూచున్నాడు.

భగవాన్! ఏంచేశావ్ భగవాన్? ఇన్నేళ్ల తపస్సుకి ఇదేనా ఫలితం? తనకే అర్థంకాని, తనకే అస్పష్టమైన ఎన్నో కలలుకన్నాడు, ఎన్నో ఆశాజ్యోతులు వెలిగించుకున్నాడు. వాటన్నిటికీ పరమావధీ ఆమేనని, రైలుపట్టాల్లా నడిచిన తమ జీవితాలు ఎక్కడో, ఎన్నడో కలియక మానవని, తాను స్వర్గధామం అందుకోక పోడని, తన హృదయంలో ఏ మూరు మూలో నిరంతరం రగులుతుండిన ప్రేమాగ్ని తనకు హామి ఇచ్చేది. అదే తన జీవితానికి ధృవతారలా నిలిచింది. కాని....కాని, తీరా ఈ రోజు పట్టాల కలయిక ఇలా ప్రమాదరూపంలో సంఘటిల్లింది, ఇదేనా తాను కోరుకుంది, తాను ఆశించింది! .... భగవాన్! .... భగవాన్!.... ఎడతెరిపి లేకుండా ఏడుస్తున్నాడు వెంకట్రావు.

గంట తర్వాత రైలు ప్రక్క నగరానికి చేరుకుంది. తెలతెలవారుతుంది. వెంకట్రావు చెంగున దిగి ప్రక్క డబ్బా కేసి పరుగెత్తాడు. మరెందరో అల్లాగే మూగారు. పోలీసువాళ్లు వాళ్లని ఆపలేక సతమతమవుతున్నారు

ఒక్కొరొక్కరినే దింపి అప్పటికే సిద్ధంగా ఉన్న అంబులెన్సు కార్లల్లోకి ఎక్కిస్తున్నారు. ఆమెనుకూడా దింపారు. ఇంకా తెలివి గాలేదు. వెంకట్రావు కెవ్వున కేకవేసి డాక్టర్ చేతులు పట్టుకున్నాడు, "డాక్టర్!....డాక్టర్!....ఆమె. ఆమె...." అంటూ.

"ఫరవాలేదు. ఇంకా బతికేవుంది. జెనరల్ ఆస్పిటల్కి తీసుకెళ్తున్నాం" అన్నాడు డాక్టర్.

వెంటనే వెంకట్రావు ఒక టాక్సీలో హాస్పిటల్ చేరుకున్నాడు. వెళ్ళి పెద్దడాక్టరు కాళ్ళు పట్టుకున్నాడు. "డాక్టర్!....డాక్టర్! ఆమెను రక్షించాలి. ఎంతైనా ఖర్చుకానీండి. మీ మేలు నేనెన్నటికీ మరిచిపోను, డాక్టర్! ఆమెను రక్షించండి" అంటూ ఒక వెయ్యి రూపాయల నోట్లు అతని చేతిలో పెట్టాడు. "ఏం ఫరవాలే"దంటూ డాక్టరు డబ్బు తిరిగి ఇచ్చేశాడు

వెంకట్రావు ఆసుపత్రి వరండాలో మహా ఆదుర్దాగా పచారు చేస్తున్నాడు మనసులో మనసు లేదు గుండెలు తీవ్రంగా కొట్టుకొం టున్నాయి క్షణమొక యుగంగా గడుస్తోంది.

వెంకట్రావుకు చప్పున ఆ నాడు "జలజ" కోసం రాసిన కథానిక "అద్దంలో ఆసుపత్రి" జ్ఞాపకం వచ్చింది! అబ్బ జీవితానికి, కదలకి ఎంత తేడా!

అప్పుడానాడు ఆ కథ రాశేప్పుడు కారు ప్రమాదం ఎంతో రొమాంటిక్‌గా వుండింది కాని ఇప్పుడు? "ఛీ! ఎందుకీ రాతలు?' అనుకు న్నాడు రెండుగంటలకు డాక్టర్‌వచ్చి వెంకట్రా వును లోపలికితీసికెళ్లాడు వెంకట్రావు గబగబా లోపలికి వెళ్ళాడు ఆమె ఒక మంచంపైన పడివుంది అప్పుడప్పుడే తెలివి వచ్చేట్టుగా కదులుతోంది వెంకట్రావు వెళ్ళి మంచం ప్రక్కన వున్న స్టూల్‌పైన కూచున్నాడు మెల్లిగా "సీతా! సీతా!" అంటూ పిలిచాడు. ఆమె అమితబాధగా ఎగరొప్పుతుంది మెల్లగా కళ్ళు తెరిచి దేన్నో వెతుకుతున్నట్టుగా చుట్టూ కలయచూచింది. ఆఖరికి ఆమె కళ్లు వెంక ట్రావు చూపులను కలసేప్పటికి ఒక క్షణం పాటు నిలబడిపోయాయి మొహాన విషాదరేఖ విడిపోయి మందహాసం వికసించినట్టుగా తోచింది వెంకట్రావుకు సంతోషంతో పొంగి పోయి "సీతా!" 'అన్నాడు నిశ్శబ్దంగా ఆమె కళ్ళు తిరిగి చుట్టూ వెదకట మారంభించాయి విషాదరేఖ తిరిగి మొహాన్ని అలుముకుంది. ఆయాసం ఎక్కువైపోయింది కొద్ది క్షణాల్లోనే ఆమె చూపులు శిలలైపోయాయి తల ప్రక్కకు వాలిపోయింది నర్సు వచ్చి మొహంపైకి దుప్పటి కప్పేసింది వెంకట్రావు గుండెలు ఆగిపోయాయి. "సీతా" అంటూ పెద్దకేక వేసి బయటికి పరుగుతీశాడు

పిచ్చిగా, శూన్యంగా గంటల తరబడి వూరంతా తిరిగి వెంకట్రావు ఆఖరికి పన్నెండు గంటలకి శ్మశానానికి చేరుకున్నాడు అప్పటికే చితికి చిచ్చంటించారు. ప్రక్కనే ఓ ముస లాయనా, ఇద్దరు పిల్లలూ నిలబడి ఏడుస్తు న్నారు వెంకట్రావు పరుగెత్తుకెళ్లి రగులుతోన్న చితి ముందర నిలబడి చేతులతో మొహాన్ని కప్పకొని వెక్కివెక్కి ఏడ్వ నారంభించాడు కొంచెంసేపటికి జేబులోంచి ఓ ముడతలువడ్డ పాత కాగితం తీశాడు అది ఆ నాడు అర్ధరాత్రి వరకూ మేలుకొని తయారుచేసిన భయంకర ప్రేమలేఖ. దాన్ని చుట్టచుట్టి చితిలోకి విసిరి వెనుదిరిగాడు.

ముసలాయన వెళ్ళి వెంకట్రావు చేతులు పట్టుకుని "ఇందాక మా సరను ప్రాణం విడిచే ప్పుడు దగ్గరుంది నువ్వేనానాయనా?'అన్నాడు

"సరసూ?.. అవును" అన్నాడు పరధ్యా నంగా వెంకట్రావు

"నా కూతురు సరస్వతి వీళ్ళు దాని సంతానం అయిదేళ్ళ క్రితం మొగుడు పోయాడు" అంటున్నాడు ముసలాయన రుద్ధ కంఠంతో వెంకట్రావు పిల్లలకేసి తేరపార చూశాడు పెద్దది ఆడపిల్ల పన్నెండేళ్ళుం టాయి చామనఛాయ, గులాబీరంగు పరికిణీ, మల్లెపూల జాకెట్, పూదారంగు వోణీ, మూడు మూర్తులా ఆ నాడు చేత పుస్తకాలు పట్టుకుని తలవాల్చుకుని సిగ్గుపడుతూ అమాయకంగా రోడ్డుప్రక్కగా నడిచివెళ్ళే తల్లికి మల్లేనే వుంది రెండోది తొమ్మిదేళ్ల కుర్రాడు కొద్దికొద్దిగా అక్క పోలికలున్నా పూర్తిగా భిన్నం

వెంకట్రావుకు ఒక్కసారి తిరిగి దుఃఖం పొంగుకొచ్చింది "మీ రెక్కడుం టున్నా"రని అడిగాడు.

ముసలాయన చెప్పతుండగా వెంకట్రావు అమాంతంగా పిల్లల్నిద్దరినీ కావిలించుకుని బావురుమని ఏడ్చాడు వెంటనే వాళ్ళను వదిలేసి ఏడుస్తోనే అక్కడ్నించి పరుగు తీశాడు

రెండోరోజు ఆ ముసలాయనకి ఓ "రిజిస్టర్డ్ కవర్" అందింది అందులో వెంకట్రావు వీలునామా వుంది తన యావదాస్తీ పిల్లలిద్దరి పేరటా రాసేశాడు

ఆ తర్వాత కథానాయకుడు వెంకట్రావు పూర్తిగా అంతర్ధానమై పోయాడు అప్పటికీ ఇప్పటికీ జాడలేదు

(సమాప్తము)